



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 09.11.2025 | సంపుటి : 2 | సంచిక :275 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Sunday | 09.11.2025 | volume : 2 | Issue : 275 | Pages : 8 | Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# బీజేపీ కుట్రలు బయటపెట్టినా ఈసీ పట్టించుకోవడం లేదు

## ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది

- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది
- ఓట్ చోరీపై రాహుల్ ఎనలేని పోరాటం
- 5 కోట్ల మందికిపైగా మద్దతు ఇచ్చారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా భారతీయ జనతా పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.

హైదరాబాద్, నవంబర్ 8 :ఈ పోరాటంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇప్పటివరకు 5 కోట్ల మందికిపైగా ప్రజలు మద్దతు తెలిపారని వెల్లడించారు. లోక్‌సభతో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేసిన అవకతవకలను కాంగ్రెస్ పార్టీ ఆధారాలతో సహా నిరూపిస్తోందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. కర్ణాటకలోని మహదేవ్ పుర నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ

- మిగతా 2 లో..



# కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆగం

## ఆట మొదలు పెడతా.. తడాఖా చూపిస్తా

### మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

కాంగ్రెస్ పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. రానున్న రోజుల్లో ఆట మొదలు పెట్టినప్పుడు తానేంటో చూపిస్తానని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కాళ్ల కింద భూమి కదలాలన్నారు.శనివారం మీడియాతో మాట్లాడుతూ.. .. తెలంగాణ బిడ్డలు బలిదానం చేసింది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కాదా అని ప్రశ్నించారు.

హైదరాబాద్, నవంబర్ 8 : బలిదానం చేసుకున్నది కేసీఆర్ కుటుంబానికి బానిసలుగా ఉ ఒడడం కోసం కాదని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అధికారం ఉన్నప్పుడు మజ్లిస్ పెత్తనం చేస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని అన్నారు. తెలంగాణ ప్రజలు అసలైన మార్పు కోరుకున్నారని

- మిగతా 2 లో..



## ఆఫ్రికా పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### రాష్ట్రపతితో వెళ్లనున్న డీకే అరుణ

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆఫ్రికాలో జరిపే అధికారిక పర్యటన లో మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ పాల్గొననున్నారు. భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ఆమె ఈ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే ఈ కీలక పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



## రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

### రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం

### మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 8 : రాష్ట్ర వ్యాప్తంగా రహదారులకు మహర్దశ ప ట్టనుందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. వీటి నిర్మాణా నికి సర్కార్ శ్రీకారం

- మిగతా 2 లో..

# విమానాశ్రయాల్లో పనిచేయని ఏటీసీ ఆటోమేటిక్

## విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు

### విమానాల రద్దు.. ప్రయాణికుల ఆందోళన

రెండు రోజుల నుంచి భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శు క్రవారం ఉదయం నుంచి ఢిల్లీలోని ఏటీసీ ఆటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. దీంతో వందల విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి ముంబైలో అదే పరిస్థితి ఏర్పడింది. ఇంకా అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్నాయి. ఇప్పుడు తాజాగా హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు.



హైదరాబాద్, నవంబర్ 8 : ఇలా వరుసగా విమానాశ్రాయాల్లో జరుగుతున్న పరిణామాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశంలోని వివిధ విమానాశ్రయాల్లోని ఏటీసీ ఆటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. 36 గంటలు దాటిన తర్వాత ఢిల్లీ, ముంబై, శివమొగ్గ ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితులు కంట్రోల్‌లోకి వస్తున్నాయి. అందుకే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లే విమానాలను రద్దు చేశారు. ఈ

- మిగతా 2 లో..

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వైన్స్, హోటల్స్ బంద్

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల ప్రత్యేక ఆంక్షలు

### నియోజకవర్గం పరిధిలో 144 సెక్షన్ విధింపు

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.



హైదరాబాద్, నవంబర్ 8 : ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా ఈ నెల 9వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు నియోజకవర్గం పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బులను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు జరగనున్న 14వ తేదీ ఉదయం

- మిగతా 2 లో..



## అమెరికాలో తెలుగు అమ్మాయి మృతి

### ఆకస్మిక మృతితో శోకసంద్రంలో కుటుంబం

బాపట్ల, నవంబర్8 : అమెరికాలో మరో తెలుగు జ్యోతి ఆరిపోయింది. బాపట్ల జిల్లాకు చెందిన అమ్మాయి మృత్యువాత పడింది. ఉన్నత విద్యనభ్యసించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఎన్నో ఆశలతో అమెరికా లో అడుగుపెట్టిన

- మిగతా 2 లో..

# ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా?

## రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

## యాజమాన్యాలను బెదిరించే ధోరణిలో ప్రభుత్వం

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు.






# రేవంత్ సభకు కొడంగల్ నుంచి జనం

## రేవంత్ సభలకు జనం కరువు

### జూబ్లీహిల్స్ ప్రచారంలో హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 8 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి కర్రు కల్చి వాత పెట్టబోతున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి రోడ్ షోలకు జూబ్లీహిల్స్ ప్రజలు రావడం లేదని తన సొంత నియోజక వర్గం కొడంగల్ నుంచి జనాలను ఇక్కడికి రేవంత్ రెడ్డి

- మిగతా 2 లో..



## ప్రతి ఇంట్లో నాటుకోడి కూరే..

### నడిరోడ్డుపై నాటుకోళ్లు వదిలారు

### ఎవరికి తోచిన విధంగా వారు ఎత్తుకెళ్లారు

హన్మకొండ,నవంబర్8 : హనుమ కొండ జిల్లా ఎల్కతుర్తిలో గమ్మత్త యిన సంఘటన చోటుచేసుకుంది. రెండు వేల నాటు కోళ్లను గుర్తుతెలి యని వ్యక్తులు వదిలివెళ్లారు. సిద్దిపేట-ఎల్కతుర్తి రహదారి వెంట పొలాల్లో వీటిని విడిచిపెట్టారు. దీంతో నాటు కోళ్లను తెచ్చుకోవడం కోసం జనం

- మిగతా 2 లో..

# ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది



(మొదటిపేజీ తరువాయి)

తప్పిదాలు, బీజేపీ చేసిన మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ చేసిన కుట్రలను రాహుల్ గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూపించారని ప్రస్తావించారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లు, 5 లక్షల డూప్లికేట్ ఓటర్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. ఒకే మహిళ ఫోటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్టుగా రాహుల్ గాంధీ నిర్ధారించారని ఆయన వివరించారు. ఇదే తరహాలో బీహార్‌లో కూడా బీజేపీ సహకారంతో "సర్" పేరుతో సంబంధం లేని ఓట్లను తొలగించిందని ఆయన విమర్శించారు. ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రస్తుత ఎన్నికల సంఘం బీజేపీ చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బిహార్‌లో ప్రారంభించిన 'ఓటు అధికార్ ర్యాలీ' బీజేపీలో వణుకు పుట్టించిందని మహేష్ గౌడ్ అన్నారు. హర్యానాలో అనుసరించిన ఫార్ములాను ఉపయోగించి బీజేపీ ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. గతంలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బీజేపీ సహకారంతో బీఆర్‌ఎస్ గెలిచిన ఉదాహరణను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. "ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, అల్లం భాస్కర్, హనుమంతు రావు, లింగం యాదవ్, గజ్జి భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను పెద్ద మెజారిటీతో గెలిపించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం మీ ప్రార్ధనా మందిరాలలో ప్రత్యేకంగా ప్రార్ధనలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ మొత్తం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ సమాజ హితం కోసం ప్రజా ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని, ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మొత్తం సమాజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, అరచేతుల్లో పెట్టి రక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రజలపై ఉందన్నారు. నవీన్ యాదవును గెలిపించి ఈ ప్రభుత్వాన్ని దీవించి ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఓటర్లపైనే ఉందన్నారు.



## ఆఫ్రికా పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటిపేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా వాణిజ్యం, వ్యవసాయం, సాంకేతికత, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక రంగాల్లో భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. తెలంగాణ మహిళా నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఇదొక గొప్ప అవకాశంగా డీకే అరుణ భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల పురోగతి, రైతుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, "ప్రపంచ ప్రగతిలో తెలంగాణ పాత్రను మరింత బలంగా నిలబెట్టడమే నా లక్ష్యం. ఈ పర్యటన ద్వారా మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే అవకాశాలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ పర్యటనతో భారత్–ఆఫ్రికా సంబంధాలు కొత్త దిశగా పయనిస్తాయని, అదే సమయంలో తెలంగాణ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా ఇనుమడిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఆట మొదలు పెడతా.. తడాఖా చూపిస్తా

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రమంత్రి తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదల ఇళ్ళు కూల్చుతామంటే ప్రాణాలు తెగించి బీజేపీ పోరాడుతోందన్నారు. మూసీ పేరుతో పేదల గూడు కూల్చితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సోషల్ మీడియా చూడాలని.. భాష, పద్ధతి మార్చుకోవాలని ఆ రెండు పార్టీల నేతలకు హితవుపలికారు. అలాగే కేటీఆర్, కిషన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కూడా కేంద్రమంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఎవరు ఎవరికి బ్రదర్స్ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్ద బ్రదర్ కేసీఆర్, తర్వాత చిన్న బ్రదర్ హరీశ్ రావు అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజలకే తాము బ్రదర్స్ అని చెప్పుకొచ్చారు. మునుగోడులో భారత సైనికులను చైనా సైనికులు కొట్టారని కేసీఆర్ అంటే.. జూబ్లీహిల్స్‌లో భారత సైనికులను ముడ్డి మీద తన్నారని రేవంత్ రెడ్డి అంటున్నారని... అసలు పాకిస్థాన్ ఉగ్రవాదులను భారతదేశం ఏం చేసిందో ప్రపంచం అంతా లైవ్‌లో చూసిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని ప్రయాణికులకు చెప్పకుండా రద్దు చేయడం గందరగోళానికి కారణమైంది. తమకు ముందస్తు సమాచారం లేకుండా ఇలా చేయడం ఏంటని ప్రయాణికులు ఆందోళనబాట పట్టారు. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కౌలాలంపూర్, వియత్నాం, గోవా వెళ్లే విమానాలను అర్థాంతరంగా రద్దు చేశారు. సాంకేతిక కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ, ముంబై, శివమొగ్గ వెళ్లే విమానాలను కూడా రద్దు చేశారు. దీనికి మాత్రం అక్కడ ఏటీసీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. అర్థరాత్రి వేళలో ఇలా నిర్ణయం తీసుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఎందుకు ఇలాంటి పని చేశారని సిబ్బందిని ప్రశ్నిస్తే రూడ్‌గా సమాధానం చెప్పారని మండిపడ్డారు. గంటల తరబడి ఎదురు చూస్తున్నా వారి నుంచి సరైన స్పందన రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్సాంకేతిక సమస్య పరిష్కారమైందనివిమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ప్రకటించింది. పరిస్థితి ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటుందని అందులో పేర్కొంది. ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ఇచ్చిన ప్రకటనలో ఇలా ఉంది , "ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విమాన ప్రణాళిక ప్రక్రియకు సహాయపడే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ ను ప్రభావితం చేసే సాంకేతిక సమస్య క్రమంగా మెరుగుపడుతోంది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. సంబంధిత అధికారులందరూ అసౌకర్యాన్ని తగ్గించడానికి పనిచేస్తున్నారు. తాజా విమాన సంబంధిత సమాచారం కోసం ప్రయాణికులు తమ విమానయాన సంస్థతో సన్నిహితంగా ఉండాలని సూచించారు." గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఢిల్లీ విమానాశ్రయంలో 800 కంటే ఎక్కువ విమానాలు ప్రభావితమయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా మూసివేశారు.



## నడిరోడ్డుపై నటుకోళ్లు వదిలారు

(మొదటిపేజీ తరువాయి)

ఎగబడ్డారు. అందినకాడికి ఇళ్లకు తీసుకెళ్లారు. వీటితో బిర్యానీ వండుకుని ఎంజాయ్ చేశారు. అయితే ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా అన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే.. ఇంత పెద్దఎత్తున నాటు కోళ్లను ఎవరు, ఎందుకు వదిలిపెట్టారో తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పలు కోళ్లను పశువైద్యాధికారిణి దీపిక వద్దకు తీసుకువెళ్లారు. కోళ్లకు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని పశువైద్యాధికారిణి తెలిపారు.

## రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)

చుట్టింది. దాదాపు రూ.60,799 కోట్లతో రోడ్లను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిధుల మంజూరు సర్కార్ ఆమోద ముద్ర వేసింది. రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని రికార్డుగా అభివర్ణించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో తెలంగాణ బహుళజాతి సంస్థల కేంద్రంగా మారబోతోందని తెలిపారు. హైదరాబాద్ ? విజయవాడ హైవే విస్తరణకు రూ.10,400 కోట్లు కేటాయించడం జరిగిందని... దీనిని ఎనిమిది లైన్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి రూ.36,000 కోట్లు మంజూరు అయ్యిందని.. ఇది రాష్ట్రానికి గేమ్‌చేంజర్ ప్రాజెక్ట్ అని వెల్లడించారు. రహదారులు లేని గ్రామాల్లో కొత్త రోడ్లు, సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. హెచ్ఏఎమ్ ప్రాజెక్ట్ కోసం రూ. 11,399 కోట్లు కేటాయించడం జరిగిందని.. ఇందు కోసం త్వరలోనే టెండర్లను పిలువనున్నట్లు చెప్పారు. మన్ననూరు ? శ్రీశైలం



ఎలివేటెడ్ కారిడార్ 52 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ. 8,000 కోట్లు కేటాయించడం జరిగిందని... అలాగే ఫ్యూచర్ సిటీ? అమరావతి–బందరు పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూ.20,000 కోట్లు కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల ప్రత్యేక ఆంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

6 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు మళ్లీ అమల్లో ఉంటాయని వివరించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిపై నిషేధం ఉంటుందని తెలిపారు. పోలీసు ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## రేవంత్ సభలకు జనం కరువు

(మొదటిపేజీ తరువాయి)

తరలిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు రూ. 2, 500 ఇస్తామన్నారని.. అవి ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. మహిళలకు రూ. 2,500 రావాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. హామీలు ఎగ్గొట్టినా గెలిపించారని సీఎం రేవంత్ రెడ్డి మీకు ఇచ్చిన హామీలు అమలు చేయడని వివరించారు.శనివారం సాయంత్రం షేక్‌పేట అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. దురదృష్టం కొద్ది మీరంతా అమితంగా ఇష్టపడి గెలిపించుకున్న మాగంటి గోపీనాథ్ అనారోగ్య కారణంగా చనిపోయారన్నారు. మగదిక్కు లేని ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడిందని స్పష్టం చేశారు. గోపీనాథ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సతీమణి సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించిందని గుర్తు చేశారు. అలాంటి వేళ బాధతో.. దు:ఖంతో ఉన్న ఆడబిడ్డ సునీతను కాంగ్రెస్ పార్టీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీతమ్మను అవహేళన చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు ఆయన సూచించారు. గోపీనాథ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పేద ప్రజలకు, బస్తీ వాసులకు అండగా



నిలిచారని చెప్పారు. నియోజక వర్గం నుంచి ఎదురీతకు లేడీ నిలుచుంటే అటు వైపు రౌడీ నిలబడ్డారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఎవరు గెలవాలి? లేడీనా? రౌడీనా? అంటూ నియోజకవర్గ ప్రజలను ఈ సందర్భంగా ప్రశ్నించారు. మీ కష్టాలు.. మీ సమస్యల పరిష్కరించేందుకు సునీతమ్మతోపాటు మేమంతా మీకు అండగా ఉంటామని ఈ సందర్భంగా బస్తీ వాసులకు హరీశ్ రావు హామీ ఇచ్చారు.



## రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

**హైదరాబాద్, నవంబర్ 8 :** 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోనే కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మాట తప్పింది మీరు. అలాంటప్పుడు వారి తాట, తోలు తీస్తామని అనడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిలబడిన వారిపై మీ వీరంగమా?" అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, యాజమాన్యాలను బెదిరించే ధోరణి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తాము అండగా ఉంటామని, వారి తరపున పోరాడతామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, బెదిరింపులతో కాదని హితవు పలికారు.

## అమెరికాలో తెలుగు అమ్మాయి మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఆ విద్యార్థిని ఆశలు అడియాశలయ్యాయి. చదువు పూర్తి చేసుకుని.. కొద్దిరోజుల్లో కొలువులో చేరుతుందని ఆశగా ఉన్న ఆ కుటుంబ ఆశల దీపాన్ని విధి వెక్కిరించింది. అనారోగ్యం రూపంలో ఆమెను బలిగొంది. బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన యార్లగడ్డ రామకృష్ణ, నాగమణి దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి (23) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్స్ విభాగంలో 2023లో చేరింది. ఇటీవల విద్యాభ్యాసం కూడా ముగియడంతో అక్కడే స్నేహితులతో కలిసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. మూడు రోజుల క్రితం జలుబు, ఆయాసంగా ఉందని.. చికిత్స కోసం ఈనెల 9కి వైద్యుల అపాయింట్‌మెంట్ తీసుకున్నానని గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపింది. అదే రోజు రాత్రి స్నేహితులతో కలిసి నిద్రపోయింది. రాజ్యలక్ష్మిని ఉదయం స్నేహితులు నిద్రలేపేందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందన లేదు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తల్లిదండ్రులిద్దరూ అచేతన స్థితిలో ఉండిపోయారని మృతురాలి సోదరుడు రాజా తెలిపారు. రాజ్యలక్ష్మి మరణంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అమెరికాలో రాజ్యలక్ష్మి మృతి చెందడంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## రేపటి నుంచి గ్రూప్-3 ధ్రువపత్రాల పరిశీలన

**హైదరాబాద్, నవంబర్ 8 :** గ్రూప్–3లో విజేతలైన వారి ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 10 నుంచి 26 వరకు నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో నిర్వహిస్తామని టీజీపీఎస్సీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, అసలు ధ్రువపత్రాలనే తీసుకురావాలని కమిషన్ కార్యదర్శి ప్రియాంక సూచించారు.

## విద్యుత్ ఉద్యోగులకు అతి త్వరలో పదోన్నతులు, బదిలీలు : నవీన్ మిత్తల్

**హైదరాబాద్, నవంబర్ 8 :** విద్యుత్ ఉద్యోగులకు అతి త్వరలో పదోన్నతులు, బదిలీలు చేపడతామని రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎకౌంట్స్ అధికారుల సంఘం రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అతి తక్కువ వ్యయంతో విద్యుత్ పంపిణీ, కచ్చితత్వంతో బిల్లుల వసూలు అంశాలపై సంస్కరణలకు ప్రభుత్వం నియమించిన కమిటీకి ఉద్యోగులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్య మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## జూనియర్ కళాశాలల్లో మరో 494 మంది అతిథి అధ్యాపకులు

**హైదరాబాద్, నవంబర్ 8 :** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 494 మంది అతిథి అధ్యాపకులు సహా మొత్తం 566 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు ఆర్థికశాఖ అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తాజాగా జీఓ జారీ చేశారు. 494 మంది అతిథి అధ్యాపకులతో పాటు పొరుగుసేవల కింద డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్లు 72 మందిని నియమించుకునేందుకు ఇంటర్ విద్యాశాఖకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అతిథి అధ్యాపకులకు నెలకు గరిష్ఠంగా రూ.28,080, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.19,500, ఆఫీస్ సబార్డినేట్లకు రూ.15,600 చెల్లిస్తారు.

## 'రైతు రత్న' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్:** రాష్ట్రంలో సుస్థిర, సమీకృత, వినూత్న, సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు 'రైతు రత్న' పురస్కారాలు అందజేయనున్నట్లు తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం వెల్లడించింది. ఔత్సాహిక రైతులు ఈ నెల 18లోగా తమ జిల్లాల్లోని వ్యవసాయాధికారుల సంఘ ప్రతినిధులను లేదా మండల వ్యవసాయాధికారులను కలిసి దరఖాస్తులను అందజేయాలని సంఘం ఛైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనూరాధ, జి.కృపాకర్‌రెడ్డి కోరారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో డిసెంబరు 3, 4 తేదీల్లో జరిగే మహాకిసాన్ మేళాలో పురస్కారాలు ఇస్తామని తెలిపారు.

## రేవంత్ రెడ్డికి జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు

**హైదరాబాద్, నవంబర్ 8 :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆ దేవుడు మీకు ఆయురారోగ్యాలు, సంతోషం ఇవ్వాలని కోరుకుంటున్నాను" అని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కొండా సురేఖ, మహమ్మద్ అజారుద్దీన్, బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, డాక్టర్ లక్ష్మణ్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డీఎంకే నాయకురాలు కనిమొళి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ

- పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాన మంత్రి మోడీ
- రాజకీయ నేతలు, సినీ, క్రీడా ప్రముఖులు విష్



**న్యూఢిల్లీ, నవంబర్ 8 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు 56వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు చెబుతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ .. తెలంగాణ సీఎం కు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ ఆయు ఆరోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుతూ ట్వీట్ చేశారు. అటు రేవంత్ రెడ్డి రాజకీయ గురువు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రేవంత్ రెడ్డికి ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఏపీ మంత్రి నారా లోకేష్ బర్త్ డే విషెస్ తెలియజేసారు. అటు సినీ రంగం నుంచి మాజీ కేంద్ర మంత్రి మెగాస్టార్ చిరంజీవి రేవంత్ రెడ్డికి బర్త్ డే విషెస్ తెలిపారు. అటు సినీ రంగం నుంచి గతంలో లాగా ఎవరు బర్త్ డే విషెస్ ఇప్పటి వరకు చెప్పలేదు. తర్వాత చెబుతారా అనేది చూడాలి. అటు రేవంత్ మంత్రివర్గ సహచరులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ .. రేవంత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతారా లేదా అనేది చూడాలి. రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8 ఉమ్మడి పాలమూరు జిల్లాలో జన్మించారు. మహబూబ్ నగర్ వంగూరు మండలం కొండారెడ్డిపల్లి రేవంత్ రెడ్డి స్వగ్రామం. ఎనుముల రేవంత్ రెడ్డి కుటుంబం చాలా పెద్దది. రేవంత్‌కు ఏడుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. రేవంత్ రెడ్డికి భార్య, కుమార్తె, అల్లుడు మనవడు రియాన్ష్ రెడ్డి ఉన్నారు. రేవంత్‌కు రాజకీయంగా, వ్యాపారపరంగా సోదరులు అండగా నిలుస్తుండడం విశేషం. తొలి దశలో రేవంత్ రెడ్డి పెయింటింగ్ పని చేశారని అక్కడి గ్రామస్తులు, అతడి సన్నిహితులు చెబుతున్నారు. అనంతరం వ్యాపారం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చి విజయవంతమయ్యారు. ఏబీవీపీ కార్యకర్తగా పనిచేసిన రేవంత్ రెడ్డి.. ఆర్ఎస్ఎస్‌కు చెందిన 'జాగృతి' అనే వార పత్రికలో పని చేశారు. ఆ క్రమంలో సంఘ్ పరివార్ తో రేవంత్‌కు మంచి అనుబంధం ఉంది. తదనంతరం అప్పటి టీఆర్ఎస్ పార్టీ (బీఆర్ఎస్)లో చేరి కార్యకర్తగా పని చేశారు. బీఆర్ఎస్ పార్టీలో రేవంత్ గులాబీ కార్యకర్తగా చురుగ్గా పాల్గొన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుత మాజీమంత్రి హరీశ్ రావు వెంట రేవంత్ రెడ్డి తిరిగాడు. స్వతంత్ర అభ్యర్థిగా జెడ్పీటీసీగా పోటీచేసిన రేవంత్ రెడ్డి అప్పటి టీఆర్ఎస్ పార్టీ మద్దతుగా గెలిచారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీ నుంచి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్సీ ఓటు విషయంలో ఓటుకు నోటుకు పాల్పడుతూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఈ కేసులో అరెస్ట్ కావడం రేవంత్ జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. ఇప్పటికీ ఈ కేసులో కోర్టులో పెండింగ్ లో ఉంది. అదృష్టం వెన్నంటి ఉండి చిన్న వయసులో పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగారు. దీంతో ఆయన తెలంగాణ రెండో ముఖ్యమంత్రి అయ్యారు. రేవంత్ రెడ్డి దూకుడుగా వ్యవహరించడం.. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం.. దురుసు ప్రవర్తన, భాష అనేది రేవంత్ రెడ్డికి చెడ్డపేరు తీసుకొస్తున్నాయి.




## వేడెక్కుతున్న బీహార్ ఎన్నికల ప్రచారం

- బీహార్ చేపల కోసం పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారు
- రాహుల్ చేపలవేటపై మోడీ వ్యంగ్యాస్త్రాలు

**పాట్నా, నవంబర్ 8 :** బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపలవేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బిహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. బిహార్‌లో చేపలు పట్టడానికి ఇప్పుడు పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారని, కొందరు ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారని ప్రధాని మోడీ ఛలోక్తులు విసిరారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఇటీవల బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు బెగుసరాయి జిల్లాలో మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగడం, చేపలు పట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని సీతామర్హిలో శనివారం నాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, ఒకానొక సమయంలో బిహార్ ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి చేపలను సేకరించేదని, కానీ మత్స్యశాఖకు సంబంధించి తాము తీసుకున్న చర్యల కారణంగా బిహార్ ఇప్పుడు చేపల పెంపకంలో స్వయం సమృద్ధిని సాధించిందని చెప్పారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి చేస్తోందని అన్నారు. ఇక్కడి చేపలను చూసేందుకు పెద్దపెద్ద వాళ్లు కూడా వస్తున్నారని, కొందరు చెరువుల్లో డైవింగ్ చేస్తుంటే, మరికొందరు బిహార్ ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారంటూ పరోక్షంగా రాహుల్‌పై సెటైర్ వేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకుగానూ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు. ఆ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారని కాంగ్రెస్ వెల్లడించింది.



## 300 క్వింటాళ్ల పత్తి దగ్ధం

### బోరున విలపించిన రైతు కుటుంబం

**సిద్దిపేట :** ప్రమాదవశాత్తూ మంటలు అంటుకొని 300 క్వింటాళ్ల పత్తి దగ్ధమైన ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బెజ్జంకికి చెందిన రైతు బండి ఐలయ్య తన పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కొద్దిరోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా.. ఇంటికి తెచ్చిన పత్తిలో తడి ఆరేందుకు ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు. ఇవాళ మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని క్షణాల్లో పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు కుమారులు రమేష్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఇన్ని రోజుల కష్టం బూడిద పాలు కావడంతో బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య పరిశీలించారు.

## దాశరథిని బందించిన జైలును సందర్శించిన కవి బృందం

**నిజామాబాద్, నవంబర్ 8 :** నిజామాబాద్‌లో కవి దాశరథిని బందించిన జైలును కవి బృందం సందర్శించింది. ఇక్కడ ఆనాటి జైలు జీవితం అనుభవించిన కవి దాశఃరథి గురించి తెలుసుకోవడం మరచిపోలేనిదని బృందం సభ్యులు అన్నారు. ప్రముఖ పద్య కవి, నాటక కర్త దూరవేటి మాట్లాడుతూ దాశరథిని బంధించిన జైలును సందర్శించడం తమ పూర్వజన్మ పుణ్యమన్నారు. ఇక్కడ అగ్నిధారలో కురిపించిన దాశరథి పద్యాలను గుర్తు చేసుకుంటూ పాడుకుంటూ పులకించిపోయారు. వికారాబాద్ కేంద్రంగా సాహిత్య వికాసానికై కృషి చేస్తున్న అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక రాష్ట్రస్థాయి కవి బృందం శనివారం నిజామాబాద్ ఖిల్లా జైలు, రఘునాథ ఆలయాన్ని సందర్శించింది. అంతకుముందు బాసర కవి యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. అందులోని సుమారు 40 మంది కవులు ఖిల్లా రామాలయాన్ని సందర్శించారు. అక్కడ దాశరథిని బంధించి ఉన్న జైల్లోకి వెళ్లి.. వారిని దర్శించుకున్నారు.



## ఓట్లు లాగేందుకు రూ.10వేల లంచం

### బీహార్ ప్రచారంలో ప్రియాంక

**పాట్నా, నవంబర్ 8 :** రూ. 10వేలు ఇచ్చి, ఓట్లు కొల్లగొట్టొచ్చని భాజపా భావిస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకాగాంధీ విమర్శించారు. కతిహార్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడారు. ఒకప్పుడు మహాత్మా గాంధీ చేసిన పోరాటమే కాంగ్రెస్ చేస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని తన ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకే అప్పగిస్తున్నారు. ఆయన కట్టా వంటి పదాలను ఉపయోగించి, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అంటూ దుయ్యబట్టారు. ఎన్నికల వేళ బిహార్ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒక్కొక్కరికీ రూ. 10వేల చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడం దాని ఉద్దేశం. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పించే దిశగా రూ. 7,500 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించారు.

## రేవంత్‌లో జూబ్లీహిల్స్ భయం

- ఓడితే పదవీ ఊడడం ఖాయం
- ఇక్కడ గెలిపించేది హైదరాబాద్ అభివృద్ధే
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 8 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో భయం మొదలైందని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత పదవీగండం పొంచి ఉందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అజెండాపైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడిస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. రేవంత్ రెడ్డి ఓటమి భయంతో చేసే పనుల్లో ఇది ఒకటని.. రేవంత్ రెడ్డి డ్రగ్స్ మత్తులో మాట్లాడుతున్నట్లుగా ఉందన్నార్క,÷శివంత్ రెడ్డి సీఎంగా వచ్చాక డ్రగ్స్ సంబంధ నేరాలు ఎక్కువయ్యాయని.. పోలీస్ కమిషనర్లే నేరాల రేటు పెరిగిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపారన్నారు. సీఎం మానసిక స్థితి దెబ్బతిన్నట్లుందని.. సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని.. ఆయనను చూసి సిగ్గు సిగ్గుపడేలా ఉందని విమర్శించారు. నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ కడితే.. రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నాడని ఆయన ప్రశ్నించారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బు÷-లలెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సెక్రటేరియట్‌పై కమిషన్ వేయవచ్చు కదా.. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు చూపిస్తావా ప్రగతి భవన్‌ల ఎన్ని రూములున్నాయో చూపిస్తావా అంటూ ప్రశ్నించారు. దేశంలో ఎవరూ తిట్టని విధంగా వైఎస్సార్‌ను, సోనియా గాంధీని తిట్టింది రేవంత్‌రెడ్డియేనన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడుతావంటూ నిలదీశారు. ఏం చేసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని, రేవంత్ రెడ్డి చేసే తప్పులకు చరిత్ర క్షమించదన్నారు. రేవంత్ రెడ్డి నోటి దూలతో బీహార్ నుంచి వెల్లగొట్టే పరిస్థితి వచ్చిందని.. బిహార్ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డిని వద్దని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పిలిపించుకున్నారన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి పదవుల్లో ఉన్నారు కాబట్టి.. ఇద్దరు బ్యాడ్ బ్రదర్స్ అన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరూ మోదీ శిష్యులేనని.. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి బాధ్యత రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని సూచించారు. హరీశ్‌రావుపై రేవంత్ చల్లర వ్యాఖ్యలు చేశారంటూ విమర్శించారు. పార్టీలో హోంగార్డ్, ఐపీఎస్, ఎవరు పెద్ద.. ఎవరు చిన్నా అని రేవంత్ హరీశ్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. సీఎం బాధతో తెలంగాణ పరువుపోతుందని.. ఇప్పటికైనా ఆయన తన భాష మార్చుకుంటే మంచిదంటూ హితవు పలికారు. సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీహార్‌లో ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం

- హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే పొత్తుపై ఆలోచిస్తా
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 8 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ఒకవేళ హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే మహాకూటమితో కలిసే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ పూర్తి దృష్టి తమ అభ్యర్థులను గరిష్ఠ సంఖ్యలో గెలిపించడంపైనే ఉందని ఆయన తెలిపారు. ఎన్డీటీవీకి ఇచ్చిన 'వాక్ ది టాక్' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నవంబర్ 14న ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఒకవేళ హంగ్ ఏర్పడితే, అప్పుడు కచ్చితంగా స్పందిస్తాం. మా కూటమి అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలిచేలా చూడటమే మా ప్రయత్నం. ఫలితాలు వచ్చినప్పుడు బీహార్ ప్రజల తీర్పు ఎలా ఉందో చూస్తాం" అని ఒవైసీ వివరించారు. బీహార్‌లోని ప్రతిపక్ష కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు ప్రధాన భాగస్వాములుగా ఉండగా, ఎన్డీఏలో బీజేపీ, జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు ఉన్నాయి. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 19 స్థానాల్లో పోటీ చేసి, ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో ఐదు స్థానాలు గెలుచుకుంది. అయితే, ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరిపోయారు. ఈసారి ఎంఐఎం 25 మంది అభ్యర్థులను బరిలోకి దించింది. తమ పార్టీ బీజేపీకి 'బీ-టీమ్' అని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "వారు నన్ను ఓట్లు చీల్చేవాడినని, బీ-టీమ్ అని అనడంలో అలసిపోరు. కానీ నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారనే విషయాన్ని ఎవరూ మాట్లాడరు. దానికి బాధ్యులెవరు? 450-500 స్థానాల్లో పోటీ చేసి మూడుసార్లు ఓడిపోయినప్పుడు ఇతరులను నిందించడం ఎందుకు? వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని ఒవైసీ ఘాటుగా స్పందించారు. బీహార్‌లో తొలి దశ పోలింగ్ రికార్డు స్థాయిలో 64.66 శాతంగా నమోదైంది. రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపడతారు.

## డ్రగ్స్ సేవించిన ఆరుగురు విద్యార్థుల అరెస్ట్

**హైదరాబాద్, నవంబర్ 8 :** డ్రగ్స్ మత్తులో యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నాయి. డ్రగ్స్‌ను పూర్తిగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తున్నప్పటికీ అడ్డుకట్టపడడం లేదు. తాజాగా హైదరాబాద్ లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. బేగంపేట్ క్యులినరీ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీలో డ్రగ్స్ కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు విద్యార్థులు గంజా సేవించినట్లు పోలీసులు గుర్తించారు. ఆరు మంది విద్యార్థులకు డ్రగ్ టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈగల్, నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా విద్యార్థులకు పరీక్షలు చేశారు. పట్టుబడిన వారు చివరి సంవత్సరం చదువుతున్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులుగా గుర్తించారు. వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి.. డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. విద్యార్థుల స్నేహితుడే డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కాన్పూర్‌లో నీట్ విద్యార్థి ఆత్మహత్య



**కాన్పూర్, నవంబర్ 8 :** నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ విద్యార్థి తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ముందు తన తల్లిదండ్రులను క్షమించమని కోరుతూ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ కంటతడి పెట్టిస్తోంది. వివరాల్లోకి వెళితే.. రాంపూర్‌కు చెందిన మహమ్మద్ ఆన్ (21) నీట్ కోచింగ్ కోసం కాన్పూర్‌లోని రావత్‌పూర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో నాలుగు రోజుల క్రితమే చేరాడు. శుక్రవారం మధ్యాహ్నం, అతని రూమ్‌మేట్ ఇమ్దాద్ హసన్ ప్రార్థనలకు వెళ్దామని పిలవగా, మహమ్మద్ నిరాకరించాడు. ఇమ్దాద్ తిరిగి వచ్చి చూసేసరికి గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా మహమ్మద్ నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ మహమ్మద్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. అతని మృతదేహం వద్ద ఒక సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "అమ్మా, నాన్న నన్ను క్షమించండి. నేను తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాను. మీ కలలను నేను నెరవేర్చలేను. అందుకే నా జీవితాన్ని ముగిస్తున్నాను. దీనికి నేనే బాధ్యుడిని" అని ఆ లేఖలో మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని, విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో కాంగ్రెస్ ఓటమి భయం

### భాజపా ఎంపీ లక్ష్మణ్



**హైదరాబాద్, నవంబర్ 8 :** సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో కాంగ్రెస్ ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. ఫ్రస్టేషన్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. భాజపాపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు భాజపాపై నిందలు వేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికొక ఉద్యోగం అంటూ.. మీ మిత్రుడు బిహార్‌లో హామీ ఇచ్చారు. 7 కోట్ల మంది ఉన్న బిహార్‌లో ఇంటికొక ఉద్యోగం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రజలకు మీరిచ్చే గిఫ్ట్ ఏంటో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చెట్టాపట్టాలు వేసుకొని అధికారాన్ని పంచుకున్నారని ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం ఇంకా దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు. పాముకు పాలు పోసి పెంచినట్టు.. పాతబస్తీలో ఎంఐఎంకు అవకాశం ఇస్తే ఈరోజు విష నాగుల మాదిరిగా పరిస్థితి తయారైంది అని ఆందోళన వ్యక్తంచేశారు.



## న్యూస్ పేపర్‌లో భోజనం వడ్డింపా

### మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై రాహుల్ మండిపాటు

**న్యూఢిల్లీ, నవంబర్ 8 :** మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి తన హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయ స్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతు న్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.

# సం(క్షేమ)క్షోభ హాస్టళ్లు!



**సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ హాస్టళ్లుగా మారుతున్నాయి. ఉమ్మడి ఎపిలో ఎలా ఉన్నాయో.. ఇప్పుడు రాష్ట్రం రెండుగా విడిపోయాక కూడా వాటి స్వరూప స్వభావాలు మారలేదు. పిల్లల పేరు చెప్పి కొందరు పందికొక్కుల్లా బలుస్తున్నారు. వార్డెన్లు భయం లేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అన్నింటికి మించి సంక్షేమ హాస్టళ్లో కాలం వెళ్లదీస్తున్న పిల్లల జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో తెలియడం లేదు. అమ్మాయిలైతే బలవంతపు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇదో రకమైన హింస. ఇందులో బయటకు వచ్చే కేసులు కొన్ని మాత్రమే. ఇకపోతే సరైన ఆహారం ఉండదు. సరైన వసతి ఉండదు. నాసిరకం ఆహారంతో వాంతులు విరేచనాలతో ఆస్పత్రి పాలు కావడం, అందులో కొందరు మృత్యువాత పడడం... క్షోభ మిగల్చడం అన్నది భేతాళ కథల్లా సాగుతున్నాయి.**

ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. హాస్టళ్లలో ఉండే పిల్లలను పురుగుల్లా చూస్తున్నారు. ఎలాంటి రక్షణ ఉండదు. తల్లిదండ్రులకు దూరంగా ఇక్కడ ఇంత తింటూ చదువుకుందామని వచ్చిన వారికి ఈసడింపులు షరామామూలే. పదేళ్లపాటు తెలంగాణను ఏలిన కల్వకుంట్ల కుటుంబం హాస్టళ్లను బాగుచేసివుంటే ఇవాళ జరుగుతున్న ఘోరాలు జరిగేవా అన్నది ఆలోచించాలి. కానీ వారు చేయలేదు. తమ కాలంలో జరిగిన అనర్థాలే ఇప్పుడూ జరుగుతున్నాయి. వీటిపై గగ్గోలు పెట్టడం కెటిఆర్, హరీష్ రావులకు అలవాటయ్యింది. ఎపిలో కూడా ఇంతకుమించి ఘటనలు జరుగుతున్నాయి. ఘనత వహించిన చంద్రబాబు పాలనలో కూడా వాటి రూపురేఖలు ఏమీ మారడం లేదు. విద్య,వైద్యానికి పెద్దపీట వేయాల్సిన పాలకులు ఓట్ బ్యాంకు రాజకీయాలతో డబ్బు వృధా చేసే పథకాలను మోస్తున్నారు. ఇకపోతే అక్షరాస్యతలో బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలపై ప్రేమ ఒలకబోయడమే తప్ప నిజంగానే వారిని ఉద్దరించే కార్యక్రమాలు శూన్యం. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 గిరిజనులకు విద్య, రక్షణ, సదుపాయాలు కల్పించాలని పేర్కొంది.గిరిజనుల విద్య కోసం చేసిన కృషిని కూడా విస్మరించలేం. అయితే అది వారు స్వయంగా ఎదిగేలా చేయడం లేదన్నదే బాధ. ఈ క్రమంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పి అక్షరాస్యత కోసం, విద్య కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసినా వాటిని బలోపేతం చేయడంలో ఇరు రాష్ట్రాల్లో పాలకులు విఫలం అయ్యారు. గిరిజనులకు విద్యను అందిస్తూ వారిని అన్ని విధాలా సామాజిక వివక్షతల నుంచి, దోపిడీ నుంచి రక్షించాల్సి ఉంది. వారు చదువుసంధ్య లేక కేవలం గూడేలకు పరిమితం కాకుండా చూడాలి. షెడ్యూలు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రకటించింది. అయినా వారి గూడాలకు నేటికీ రోడ్డు లేదు. సరైన చదువు, వైద్యం లేదు. అనేక ప్రాంతాల్లో గిరిజన హాస్టళ్లు బాలారిష్టాలతోనే కొనసాగుతున్నాయని ఆయా ప్రాంతాలలో జరిగే సంఘటనలే నిరూపిస్తున్నాయి. నేటికీ గిరిజన ప్రాంతాల నుండి ఆసుపత్రికి రావాలంటే డోలీ మోతలు చూస్తున్నాము. ఆ ప్రాంత ప్రజలపైగల బాధ్యతా రాహిత్యం విద్యార్థులు చదువుకునే సంక్షేమ గృహాలపై కూడా కొనసాగుతున్నది. ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నపుడు తాగునీరు లేక, మరుగుదొడ్లు లేక రోగాల బారినపడి చనిపోయిన ఘటనలను చూశాం. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కురుపాం మండల కేంద్రంలోగల గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ఘటన వరకు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ఇద్దరు బాలికలు చనిపోవడం, 138 మంది పచ్చ కామెర్లతో ఆసుపత్రిపాలు కావడం సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం ఏ విధంగా శ్రద్ధ చూపుతున్నదో అర్థం అవుతున్నది. క్వాంటం కంప్యూటింగ్, ఎఐ అంటూ నిత్యం ప్లలె వేస్తున్న చంద్రబాబు ఈ హాస్థల్ల దుస్తజతి తెలుసుకోక పోవడం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లో

గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఎక్కువ శాతం సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. బాలికల వసతి గృహాలు సరిపడినన్ని లేక అత్యంత దయనీయంగా వున్నాయి.. పాఠాలు బోధించడానికి, బాలికలు నిద్రించడానికి, సామానులు భద్రపరచడానికి, భోజనాలు చేయడానికి అన్నింటికీ ఒకటి రెండు గదులతో సరిపుచ్చు తున్నారు. చెప్పాలంటే గురుకులాలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. బాలికల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా ఎ.ఎన్.ఎం లు లేరు. గురుకులాలలో ఉన్నప్పటికీ తగిన మందులు, సౌకర్యాలు కల్పించడంలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు భయపడి ఆందోళనతో స్వంత డబ్బులతో ఆరోగ్య కార్యకర్తలను నియమించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాలకులు మారుతున్నా పరిస్థితులు మారడం లేదు. వార్డెన్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన లేనందున ఉపాధ్యాయులే ఒకవైపు బోధన మరోవైపు, పిల్లల బాధ్యత చూడటం జరుగుతోంది. వైద్యపరమైన సేవలు అందించడానికి సిబ్బంది లోపం కూడా విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో మెడికల్ ఖర్చు భరించేందుకు తగిన నిధిని సమకూర్చడం లేదు. సంక్షేమ హాస్టళ్లలో చిన్నపిల్లల ఆలనా పాలన చూసే ఆయాలు గాని, టీచర్లు గాని ప్రత్యేకంగా లేకపోవడం వలన పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిజానికి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలి. బడులు లేక, ఉన్నాబడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు ఎక్కడికి వెళ్లినా దర్శనమిస్తున్నాయి. తాగునీటిది పెద్ద సమస్య. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు. ఎప్పటికప్పుడు మౌలిక వసతులు కల్పించే విషయంలో బ్జడెట్ కేటాయింపులు పెంచాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, మరమ్మతులు, వైద్య అవసరాలు, పోషక విలువలతో కూడిన మెనూ చార్జీల పెంపునకు నిధులు వుండాలి. పేదరికం, దోపిడీ, వెనుకబాటుతనం నుండి విముక్తి జరగాలంటే హాస్టళ్లను బలోపేతం చేయాలి. పాఠశాలలకు ఆయా హాస్టళ్లను అటాచ్ చేయాలి. ప్రత్యేకించి నిధులు పెంచాలి. అప్పుడే పేదలకు విద్య అందుతుంది.

# రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత



## ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

**హైదరాబాద్, నవంబర్ 8 :** రాష్ట్రంలో చలి తీవ్రత మొదలైంది. గత రెండు రోజులుగా అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. రాత్రిపూట చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. దీంతో చాలాచోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో అతితక్కువగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, రంగారెడ్డి జిల్లాలోని షాబాద్‌లో 14.7 డిగ్రీలు నమోదయింది. సంగారెడ్డిలోని జహీరాబాద్‌లో 14.8, శంకర్‌పల్లి 14.9, మొయినాబాద్ 15 డిగ్రీలు, ఆదిలాబాద్‌లోని భీమ్‌పూర్ 15, సంగారెడ్డిలోని జిన్నారంలో 15.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇక, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్?, మహబూబ్?నగర్?, నారాయణపేట, నాగర్ ?కర్నూల్?, యాదాద్రి భువనగిరి, జనగామ, పెద్దపల్లి జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువైంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాజేంద్రనగర్‌లో 15.3, హెచ్‌సీయూలో 15.3, బీహెచ్‌ఈఎల్ 15.5, మల్కాజిగిరి 15.7, కుత్బుల్లాపూర్ 15.7, గచ్చిబౌలి 15.9, మారేడ్‌పల్లి 16, ఆర్సీపురం 16.1, బేగంపేట 16.4, నేరేడ్‌మెట్ 17.1, అల్వాల్ 17.1, కార్వాన్ 17.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కాగా, ఈ నెల 9న మరింత తకువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది.

# బిజెపికి ఎల్లవేళలా ప్రవాసుల ఆదరణ

- జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ అండగా నిలవాలి
- కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

**హైదరాబాద్, నవంబర్ 8 :** ఇద్దరు సభ్యుల బీజేపీ.. ఇప్పుడు దేశంలోనే ఎక్కువ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీగా నిలవడంలో ప్రవాసీల పాత్ర మరువరానిదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో స్థిరపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులతో కలిసి భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా ఆత్మీయ సమ్మేళనాన్ని సోమాజిగూడలోని ఓ హోటల్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ భారతీయ జనతా పార్టీ జెండా రెపరెపలాడించడంలో ప్రవాసీలు అత్యంత కీలక పాత్ర పోషించారన్నారు. ఎన్నో ఉద్యమాల తరువాత తెలంగాణ పుట్టిందన్న ఆయన పదేళ్ల పాటు కుటుంబ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందన్నారు. అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ఎంఐఎంతో ఒప్పందాలు చేసుకుని తమ ప్రభుత్వాలను నడిపాయని ఆరోపించారు. నవీన్ యాదవ్ అప్పుడు ఎంఐఎం.. ఇప్పుడు కాంగ్రెస్ తరఫున పోటీపడుతున్నాడని, ఈ పార్టీల ఒప్పందం ఎలా ఉందో తేటతెల్లం అవుతుందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు జూబ్లీహిల్స్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ఘనమైన బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దివాలా తీసిందన్నారు. కాంగ్రెస్ వచ్చాక పరిస్థితులు మరింత దిగజారాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రానుందని, అందుకు జూబ్లీహిల్స్ గెలుపు నాంది కావాలని ఆకాంక్షించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ దేశం, సమాజం కోసం బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రియాజ్‌ది లాకప్‌డెత్

- పోలీసులే రియాజ్ కొట్టి చంపేశారు
- ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారు
- ఘటనపై సమగ్ర విచారణ జరిపించండి
- పోలీసులపై రియాజ్ ఫ్యామిలీ ఆరోపణలు

**హైదరాబాద్, నవంబర్ 8 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన రియాజ్ ఎన్‌కౌంటర్ కేసు మరో మలుపు తిరిగింది. ఇది కచ్చితంగా ఫేక్ ఎన్‌కౌంటర్ అని రియాజ్ ఫ్యామిలీ ఆరోపిస్తోంది. ఆయన్ని కాల్చేసి తర్వాత ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారని విమర్శిస్తున్నారు. ప్రమోద్‌ను కూడా హత్య చేసింది రియాజ్ కాదని అనుమానం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ప్రమోద్ హత్యపై లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిజంగా హత్య చేసిన వాడిని అరెస్ట్ చేసి.. ప్రమోద్ కుటుంబానికి న్యాయం చేయాలని అంటున్నారు. రియాజ్ కుటుంబంపై ఇప్పటికి వేధింపులు జరుగుతున్నాయని... ఆ కుటుంబంలోని చిన్న పిల్లలను రోడ్ల మీద వేధిస్తున్నారని... దీనిపై వాళ్ళకు న్యాయం జరగాలి అభ్యర్థిస్తున్నారు. మొత్తం కేసులో ఆసిఫ్ పాత్ర ఉందని రియాజ్ కుటుంబ సభ్యులు అనుమాన పడుతున్నారు. అతనిపై లోతుగా విచారణ చేయాలన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌లో భాగమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులకు తాము వ్యతిరేకం కాదని ఈ ఎన్‌కౌంటర్‌ను కొందరు పోలీసులు కుట్రపూరితంగా చేశారని మండిపడుతున్నారు. సీబీఐతో విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వానికి అభ్యర్థించామని వారు వినకపోయే సరికి జాతీయ స్థాయిలో పోరాడుతున్నామని అన్నారు. మీడియాతో మాట్లాడిన సందర్భంగా రియాజ్ తల్లి భావోద్వేగానికి గురయ్యారు. "నా కొడుకు మెడ విరిచేశారు. పొట్టలో నుంచి పేగులు బయటకు వచ్చాయి. దారుణంగా చంపేశారు. నా కొడుకు నిజంగా హంతకుడు అయితే ఆ ఆధారాలు చూపించండి. నాకు మనశ్శాంతిగా ఉంటుంది. ఏ తల్లికైన కొడుకు కొడుకేగా.. నా కొడుకుకు జరిగినట్లు ఎవరికి జరగకూడదు. నా కొడుకు చనిపోయినప్పుడు, అంతిమ యాత్రలో తీసుకెళ్తుంటే పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నా కొడుకు అంతిమ యాత్రలో పోలీసులు వచ్చి ఎక్కడా ఆగనివ్వకుండా పంపించేశారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తుంటే, ఇక్కడ చేయకూడదు అని వెళ్లగొట్టారు. ఎవరి కొడుకుకైనా ఇలాంటి పరిస్థితి రాకూడదు." అని కంటతడి పెట్టుకున్నారు.

రియాజ్ ఎన్‌కౌంటర్ ఘటనపై సోషల్ యాక్టివిస్ట్ మాట్లాడుతూ... రియాజ్ ఒక పోలీస్ అధికారిని నిజంగా చంపితే అతను నిజామాబాద్‌లో ఉంటాడా.. వాళ్ళ ఫ్యామిలీని తీసుకొని పారిపోడా? పోలీసులు తన కుటుంబాన్ని హింసిస్తున్నారని రియాజ్ తానే స్వయంగా లొంగిపోయాడు. లొంగిపోయిన తరువాత పోలీసులు అతనిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలు పెట్టారు. అతను కస్టడీలోనే చనిపోయాడు. రియాజ్ చనిపోయాక అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, 407 ఖైదీల రూంలో పెట్టారు, 4వ ఫ్లోర్‌లో ఉన్న రోగులు అందరిని ఖాళీ చేయించారు. చేతులు కట్టేసి ఉంటాయి.. రియాజ్ మెడ విరిగిపోయింది, శరీరం మీద తీవ్ర గాయాలు ఉన్నాయి. అలాంటి మనిషి పోలీసులను ఎదిరించి గన్ లాక్కుంటాడా?. అలా చెప్పి, పోలీసుల ఉన్నతాధికారుల సమక్షంలో మృతదేహానికి మూడు బుల్లెట్లను కాల్చారు. రియాజ్ కస్టడీలో బతికే ఉంటే ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు నడుచుకుంటునో, వీల్ చైర్‌లోనో తీసుకెళ్తారు కదా.. ఆ సీసీటీవీ ఫుటేజ్ చూపించడం లేదు. మృతదేహం చూశాక అతని మెడ ఊగిపోతోంది, ముక్కు విరిగిపోయింది, పెదాలు పగిలిపోయాయి. దీనిపై సీబీఐ ఎంక్వేరీ వేసి నిజానిజాలు బయటకు చెప్పాలి. అని అన్నారు.

# పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణలు

- శాంతి చర్చలు విఫలమవడంతో ఘర్షణ
- సైనికులు, పౌరులతో సహా వందల మంది మృతి

**ఇస్లామాబాద్, నవంబర్ 8 :** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఖతార్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు ఎటువంటి ఫలితం తేలకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడానికి పాకిస్థాన్ బాధ్యతారహిత వైఖరే కారణమని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య ఘర్షణలు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చర్చల్లో పాకిస్థాన్ తన భద్రతా వైఫల్యాలన్నింటినీ ఆఫ్ఘనిస్థాన్‌పై నెట్టే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆఫ్ఘన్ భద్రతకు గానీ, తమ సొంత భద్రతకు గానీ బాధ్యత వహించడానికి ఎలాంటి సుముఖత చూపలేదు. పాక్ అనుసరించిన బాధ్యతారహితమైన, సహకరించని వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, పాకిస్థాన్ కూడా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని శుక్రవారమే అంగీకరించింది. అంతర్జాతీయ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు తాలిబన్లు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని పాక్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, తమ దేశంలో అనేక దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండించారు. ఏ దేశంపైనా దాడికి తమ భూభాగాన్ని ఉపయోగించుకోనివ్వబోమని, అదే సమయంలో తమ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలను గట్టిగా ప్రతిఘటిస్తామని వారు స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి జరిగిన దాడుల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించారని, 447 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు, తాలిబన్ల దాడుల్లో 23 మంది సైనికులు మరణించారని, 29 మంది గాయపడ్డారని పాక్ సైన్యం ప్రకటించింది. చర్చలు విఫలమవడంతో మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, టర్కీలకు పాకిస్థాన్ కృతజ్ఞతలు తెలుపుతూనే, తమ ప్రజలను, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# నిలిచిపోయిన వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానం

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన

**హైదరాబాద్, నవంబర్ 8 :** శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు శనివారం ఆందోళన చేపట్టారు. వియత్నాం ఎయిర్‌లైన్స్ కు చెందిన వీఎన్-984 విమానం శుక్రవారం రాత్రి శంషాబాద్ నుంచి వియత్నాంకు వెళ్లాల్సి ఉంది. కానీ సాంకేతిక సమస్య తలెత్తడంతో అధికారులు సర్వీసును నిలిపివేశారు. 200 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. మరోవైపు భారీ మరమ్మతుల కారణంగా ఈ విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు శనివారం ఉదయం 11 గంటలకు అధికారులు ప్రకటించారు. రీషెడ్యూల్ చేసిన విమానంలో ప్రయాణికులను పంపిస్తామని, అలా వెళ్లడానికి ఇష్టం లేని ప్రయాణికులకు పూర్తిస్థాయిలో టికెట్ డబ్బులు రీఫండ్ చేస్తామని హామీ ఇచ్చారు. కౌలాలంపూర్ వెళ్లాల్సిన విమానంలోనూ సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో నిర్దేశిరచిన సమయం కంటే 6 గంటల ఆలస్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. ఢిల్లీలో తలెత్తిన ఏటీసీ సాంకేతిక సమస్య వల్ల ఢిల్లీ, ముంబయి, శివమొగ్గ విమానాలు రద్దయ్యాయి. గోవా వెళ్లాల్సిన విమానం ఆలస్యంగా బయలుదేరింది.

# బ్రెజిల్‌లో సుడిగాలుల బీభత్సం

## ఐదుగురు మృత్యువాత

**బ్రసిల్లా, నవంబర్ 8 :** దక్షిణ బ్రెజిల్‌లోని ఒక పట్టణంలో కొన్ని ప్రాంతాలను సుడిగాలి తుడిచి పెట్టింది. ఈ సుడిగాలికి ఐదుగురు మృత్యువాతపడ్డారు. 130 మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. పరానా రాష్ట్రంలోని రియో బోనిటో డో ఇగువాకు అనే మునిసిపాలిటీలో సంభవించిన సుడిగాలి వల్ల కార్లు బోల్తాపడ్డాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి అని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది. ఈ సుడిగాలికి ఐదుగురు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పరానా పౌర రక్షణ శాఖ ఓ ప్రకటనలో నివేదించింది. ఈ ఘటనలో 30 మందికి తీవ్రగాయాలయ్యాయని, వంద మందికి మాత్రం స్వల్పగాయాలయ్యాయని స్థానిక రెస్క్యూ ఏజెన్సీ తెలిపింది. 14 వేల జనాభా కలిగిన రియో బోనిటో డో ఇగువాకులో గంటకు 180 నుండి 250 కిలోమీటర్ల వేగంతో వీచినట్లు పరానా పర్యావరణ వాతావరణ శాఖ తెలిపింది. ఈ విపరీతమైన గాలుల వల్ల చెట్లు కూలిపోయాయి. రాతి భవనాలకు కూడా నష్ట వాటిల్లందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ఘటనపై పరానా గవర్నర్ రతినో జూనియర్ స్పందించారు. భద్రతా బలగాలు అప్రమత్తమై ఈ తీవ్ర తుఫానుల బారినపడిన నగరాలను పర్యవేక్షిస్తున్నాయని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో తెలిపారు. పరానాతోపాటు దక్షిణ రాష్ట్రాలైన్ర శాంటా కాటరినా, రియో గ్రాండేడో సుల్‌లకు కూడా తుఫానులు సంభవించవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# డివైడర్‌ను ఢీకొని బోల్తాపడ్డ కారులో మంటలు

## ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులు

**నల్లగొండ, నవంబర్ 8 :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ కారు గుండ్రాంపల్లి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం బోల్తాపడింది. దీంతో మంటలు చెలరేగి కారు దగ్ధమయింది. అయితే అందులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్వల్పంగా గాయపడిన వారిని దవాఖానకు తరలించారు. రోడ్డు ప్రమాదంతో చిట్యాల వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసారు.



# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు ఈ నెల 16 వరకు చెల్లించాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా మహాసభ శనివారం పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా సిఐటియు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న రెండు కోట్ల 28 లక్షల బిల్లులు వెంటనే చెల్లించాలని గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5వ తేదీ లోపు వంట బిల్లులు వేతనాలు చెల్లించాలని కార్మికులందరికీ ఇన్సూరెన్స్ పిఎఫ్ ఈఎస్ఐ యూనిఫారం గుర్తింపు కార్డులో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంటే వాటిని చెల్లించకుండా ఎమ్మెల్యే , హెడ్మాస్టర్లు టీచర్లు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టమని ఒత్తిడి చేయడం సరికాదన్నారు .ఇప్పటికే అప్పుల పాలైనటువంటి కార్మికులకు మెనూ అమలు చేయడం సాధ్యం కాదని తెలియజేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికుల్లో మెజార్టీ కార్మికులు ఎస్సీ ఎస్టీ బీసీలకు సంబంధించిన పేద కిందిస్థాయి తరగతి ప్రజలు వాళ్ళు ఈరోజు ఈ అప్పుల బాధలు భరించలేక ఇంట్లో ఉన్న సామాన్లు తాళిబొట్లు తాకట్టు పెట్టి బతుకుతెరువు కోసం ఈరోజు వంట కార్మికులుగా కొనసాగుతున్నారు కాబట్టి అధికారులైనా ఎమ్మెల్యే గారైన మానవత దృక్పథంతోని వాళ్ళ బిల్లులు ఇచ్చేందుకు కృషి చేయాలని అప్పటివరకు ఒత్తిడి చేసి వాళ్లను మానసిక వేదన గురిచేసి ఇబ్బందులకు నెట్టకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో ముదాం అరుణ్ రాజనర్సు మోహన్ దశరథ్ కృష్ణ వంట కార్మికులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక కాగా అధ్యక్షులుగా సరస్వతికార్యదర్శిగా వెంకటేష్ కోశాధికారిగా వాణి ఉపాధ్యక్షులుగా దుర్గయ్య రాజమణి ప్రమీల సహాయ కార్యదర్శులుగా పరశురాములు సత్తయ్య లావణ్య రజిత ప్రచార కార్యదర్శిగా ఆంజనేయులు మొత్తం 23 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగిందనీ తెలిపారు.



# మోకిల రైతు వేదికలో కిషోర్ బాలికల సమావేశం

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** శనివారం రోజు మోకిల రైతు వేదికలో కిషోర్ బాలికల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 100 మంది కిషోర్ బాలికల సంఘాల ప్రతినిధులు హాజరు కావడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్ వి ఫౌండేషన్ కోఆర్డినేటర్ భాస్కర్, మోకిలా పి ఎస్ పి ఎస్సై పద్మ హాజరై మాట్లాడుతూ....ఆడ పిల్లలపై జరుగుతున్న అరాచకాలు గురించి మాట్లాడడం, ఆడ పిల్లలందరూ చదువుకొని ఎదగాలని, పై స్థాయిలో ఉండాలని, గట్టిగా నిలబడి సాధించాలని, ఆడపిల్ల తన లక్ష్యం చేరుకునే వరకు చదువులకు ఎన్ని అడ్డంకులు వచ్చినా చదువును ఆపకూడదని సూచించారు. ఆడపిల్లల లైంగిక వేధింపుల నిరోధానికి రక్షణకు పిఓసిఎస్ఓ చట్టం ఉందని వివరించారు. ఏపిఎం రవీందర్ మాట్లాడుతూ...ఆడపిల్లల సంఘాలతో ప్రభుత్వం స్నేహపూర్వక కార్యక్రమాన్ని ప్రారంభించిందని, అందులో మీరంతా పాలు పంచుకోవాలని, మేము ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతామని చెప్పారు. టీఏఎస్ఎస్ లీడర్స్ మాట్లాడుతూ...మా నినాదం ప్రమాణత్వ సాధన, ఆడపిల్లలపై జరిగే అన్ని రకాల హింసలు ఇక చాలు అని సమాజానికి తెలియజేయడం, అలాగే ప్రభుత్వాల నినాదాలతో మార్పులు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లుల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ, తెలంగాణ ఆడపిల్లల మానవత్వ సమైక్య స్టేట్ కమిటీ లీడర్ మానస, భవ్య టంగుటూరు హాస్పిటల్ డాక్టర్ పాల్గొనడం జరిగింది. ఎంఈఎఫ్ కార్యకర్తలు టి మంగ, ఎం మంగ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



# అయ్యప్పస్వామి మాలధారణ పవిత్రమైంది

- ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి
- మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** హరిహర పుత్ర అయ్యప్పస్వామి దీక్షతో నూతన జీవన విధానానికి నాంధీ పలుకుతుందని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్- శిరీష దంపతుల నివాసంలో అయ్యప్పస్వామి పడిపూజను సంగయ్య గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి నిర్వహించే పూజల్లో పడిపూజ ఎంతో విశిష్టమైనది. అయ్యప్పస్వామికి విషేశ పూజలు పూలు,పండ్లతో చేసి పంచామృతాభిషేకం నిర్వహించారు. పూజా స్థలంను పూవ్వులు,దీపాలు,దూపాల నడుమా స్వాములు చేసిన అయ్యప్పస్వామి నామస్మరణతో ఆధ్యాత్మీకతను వెల్లువిరిసింది. అనంతరం స్వాములకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాములు 41రోజులు ఎంతో భక్తిశ్రద్ధలతో, నిష్టతో స్వామివారిని పూజిస్తారని చెప్పారు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో జిల్లా ప్రజలు, సూర్యాపేట ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎలిమినేటి రమేష్- ఉమా దంపతులు, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ జహీర్,పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, పట్టణ ఐఎన్ టియుసి అధ్యక్షుడు వల్దాసు శ్రీను(రెబల్), జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు చెంచల నిఖిల్ నాయుడు, ఎర్రంశెట్టి సతీష్,లక్ష్మణ్, ఎలిమినేటి అభినాష్, అయ్యప్ప స్వాములు,తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- ఎంతటి నేరస్తులైనా పోలీసుల నుండి తప్పించుకోలేరు
- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** అక్టోబర్ 31వ తేదీ 2025 రోజున చిన్న మల్లారెడ్డి గ్రామ శివారులో పాత పాత హైవే ఎన్ హెచ్ 7 రోడ్డు పక్క ఉన్న ఆటో ఎలక్ట్రికల్ షాపు (రేకుల షెడ్డు) లో గుర్తుతెలియని వ్యక్తులు రేకులను తొలగించి షెడ్డు లోపలికి చొరబడి షెడ్డు నుండి కారు, స్పేర్ పార్ట్స్, బ్యాటరీలు, ఏసీ ప్యానెల్ అలాగే సీసీటీవీ హార్డ్ డిస్క్ లను దొంగిలించారని దేవునిపల్లి పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు అందగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులకు తెలిపారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ అలాగే పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కొన్ని దొంగతనాల నేరస్తులను పట్టుకోవడానికి కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర గారి ఆదేశాల మేరకు కామారెడ్డి ఏ ఎస్ పి చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి. రూరల్ సిఐ రామన్,, సి సి ఎస్ సి ఐ శ్రీనివాస్, దేవునిపల్లి ఎస్సైలు రంజిత్, భువనేశ్వర్ సి సి ఎస్ ఎస్ ఐ ఉస్మాన్ లతో ప్రత్యేక టీమ్లుగా ఏర్పాటు చేసి సీసీటీవీ కెమెరాల ద్వారా ఇతర సాంకేతిక సమాచారం ఆధారంగా శనివారం రోజున నరసన్నపల్లి కమాన్ దగ్గర మరల నేరం చేద్దామని అనుమానాస్పదంగా తిరుగుతుండగా నిందితులను చాకచక్యంగా పట్టుకొని విచారించగా వారు కామారెడ్డి జిల్లాలోని దేవునపల్లి కామారెడ్డి సహజనగర్ బికనూర్ పోలీస్ స్టేషన్లో పరిధిలో చేసిన 15 దొంగతనాలు ఒప్పుకోవడం జరిగిందనీ ఎస్పీ గారు తెలిపారు. నిందితులు ఏవన్ షేక్ రఫీక్, ఏటు షేక్ ఖాదర్, ఏ3 షేక్ ఖయ్యూం, ఏ ఫోర్ బండారి అశోక్, ఏ ఫైవ్ షేక్ అజ్జు లను రిమాండ్ కు పంపుతున్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. దొంగతనాలు జరగకుండా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయా ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరిగే అవకాశాలు తక్కువ ఉంటాయని ఒకవేళ ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకోవడం సులువుతుందని ఇట్టి విషయంలో ప్రజలు సహకరించాలని అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ వివరించారు ఈ కార్యక్రమంలో ఎస్పీ చైతన్య రెడ్డి డిఎస్పీలు ఎస్సైలు సాంకేతిక సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్య ప్రమాదాలు ఒకవైపు జరుగుతుంటే..

- రోడ్డుపై టర్నింగ్ పాయింట్‌లో బొమ్మకారులతో ఆటలాడుతున్న కొందరు
- అనంతగిరి పరిసర ప్రాంతాలలో ఇలాగే కొనసాగితే పరిస్థితి...?





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నిత్యం రోడ్డు యాక్సిడెంట్లు గోరాది గోరంగా జరుగుతూ ఉన్న సందర్భాలు కనిపిస్తూ ఉన్నాయి. మెయిన్ రోడ్ లోనే ఈ విధంగా యాక్సిడెంట్లు జరుగుతూ ఉంటే మూలమలుపు ప్రదేశాలలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి కానీ మూలమలుపు ప్రదేశంలో కొందరు ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ సమీపంలోని అనంతగిరి పర్యాటక ప్రదేశంలో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ప్రయాణి కులు ఆరోపిస్తున్నారు. స్వీట్ గా ఉన్న రోడ్లో వెళ్తే యాక్సి డెంట్లు జరుగుతున్న ఈ తరుణంలో మూలమలుపు ప్రదేశాలలో కొందరు బొమ్మకారులతో రిమోట్ ఉపయోగిస్తూ ప్రయాణికులు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఏర్పడుతున్నారన్నారు. అనంతగిరి పర్యాటక ప్రదేశంలో ఈ విధంగా ప్రయాణికులకు ఇబ్బంది మూలమలు ప్రదేశంలో జరగరాని సంఘటన జరిగితే తీవ్ర నష్టం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇలాగే విచ్చలవిడిగా రోడ్డు మీద వారి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే ఈ లోయ ప్రాంతంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే తీరని లోటు ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనంతగిరి పర్యాటక ప్రదేశంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు




**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు అత్యధికంగా పాల్గొని కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి, కేక్ తినిపించుకుంటూ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తు, ప్రజాపాలనలో తెలంగాణ గుండెల్లో సింహాసానాన్ని అధిష్టించిన మనసున్న మా రాజు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదవాడికి ఉచిత కరెంట్, రైతులకు రుణమాఫీ, రైతు బందు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి, ప్రజల సంక్షేమం కోరుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించండి : కేటీఆర్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రెండే పార్టీల మధ్య జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీలను ఎగ్గొట్టి, పేదవాడి గూడు కూలగొట్టి, వాళ్ల నడుం విరగ్గొట్టి ఉపాధి లేకుం డా చేస్తున్న కాంగ్రెస్‌కు... పేదవాడి కోసం ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తున్న భారాసకు మధ్య జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. భారాస కారుకి, కాంగ్రెస్ బుల్డోజర్ మధ్య జరుగుతున్న ఎన్నికని అభివర్ణించారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓ డించాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని ఎర్రగడ్డ డివిజన్‌లో శనివారం నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన ప్రసంగించారు. “ఎర్రగడ్డకు వచ్చి ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అడుగుతున్నా రు. ఒక్క అవకాశం ఇచ్చినందుకే అన్ని వర్గాలను మోసం చేశారు. ఒక్కసారి మోసపోతే తప్పు వారిది. మళ్లీ మళ్లీ మోసపోతే తప్పు మనదవుతుంది. 420 హామీలు ఇచ్చి, దళితులు, బీసీలు, గిరిజన డిక్లరేషన్లు ప్రకటించి... ఒక్కటీ నెరవేర్చలేదు. భారాస అభ్యర్థి మాగంటి సునీతను గెలిపిస్తే, మా చేతికి తల్వార్ ఇస్తే.. ఎవరైనా పేదల ఇళ్లు కూలగొట్టడానికి వస్తే కొట్లాడ తాం. హైడ్రా ఎప్పుడు ఏ గల్లీకి వచ్చి ఇళ్లు కూల్చే స్తుందో చెప్పలేం. కత్తి ఎవరికో ఇచ్చి మమ్మల్ని కొట్లాడమంటే కష్టం. హైడ్రా రాక్షసిని మేం ఊరికే వ్యతిరేకించటం లేదు. పేదల ఇళ్లు కూలగొడుతున్న హైడ్రా... పెద్దల ఇళ్ల జోలికి పోవడం లేదు. హైదరాబాద్‌లో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టారు. రెండేళ్లయినా రేవంత్ ఒక్క ఇల్లు కట్టారా? జూబ్లీహిల్స్‌లో ఎన్ని రోడ్లు వేశారో, హైదరాబాద్‌లో ఎన్ని ఫ్లైఓవర్లు కట్టారో చెప్పాకే ఆయన ఓట్లడగాలి. ముస్లింలలో పేదలున్నారని కాంగ్రెస్ అంటోంది. దేశంలో అత్యధిక సార్లు అధికారం చెలాయించింది కాంగ్రెస్ పార్టీనే కదా... ఇన్నాళ్లు ఏం చేసింది? భారాస హయాంలో రాష్ట్రంలో 204 మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేశాం. షాదీముబారక్ అమలు చేశాం అన్నారు.







# 48 గంటల్లో గన్ని సంచుల సరఫరా

- అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి
- జిల్లాలో ఎక్కడా గన్నీ సంచుల కొరత లేదు

**ఖమ్మం,రాజముద్ర న్యూస్ :** ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48 గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ -2025 ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోలు అవసరాలకు మాత్రమే గన్ని సంచులు అందించడం జరుగుతుందని, రైతుల ఇంటి వద్దకు గన్ని సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 9 లక్షల 71 వేల 500 గన్ని సంచులు పంపిణీ చేశామని అన్నారు. గన్ని సంచుల కోసం కొనుగోలు కేంద్రాలు ఇండెంట్ పెట్టిన 48 గంటల లోగా సరఫరా చేస్తున్నామని, గన్ని సంచులకు జిల్లాలో ఎక్కడా కొరత లేదని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# భారతరత్న, లోహ పురుషుడు లాల్ కృష్ణ అద్వానీ

## బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్


**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారతదేశ మాజీ ఉప ప్రధాని,బిజెపి జాతీయ నాయకులు లాల్ కృష్ణ అద్వానీ జన్మదిన వేడుకలు శనివారం బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకి పంచి పెట్టారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ 1927 జూన్ 8న సింధ్ ప్రాంతంలోని కరాచీ పట్టణంలోని సంపన్న వ్యాపార కుటుంబంలో జన్మించిన అద్వానీ ఇద్దరు ఎంపీలు ఉన్న బిజెపిని 150 మంది ఎంపిలు ఉన్న పార్టీగా రూపొందించారని తెలిపారు. 90 వ దశకంలో అద్వానీ,వాజ్ పేయి ద్వయం భారతదేశ రాజకీయాల్లో కీలకంగా మారి 1996 లోక్ సభ ఎన్నికల్లో మొదటిసారి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్రను సృష్టించారని చెప్పారు. భారతదేశ రాజకీయల్లో లోహ పురుషుడుగా ప్రసిద్ధి గాంచిన లాల్ కృష్ణ అద్వానీ జయంతి జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా సేవలు అందించిన అద్వానీకి అత్యున్నత పురస్కారం భారతరత్న లభించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యధర్శులు మల్లెబోయిన గోవిందరావు,బాజా రామకృష్ణ,నాయకులు సయ్యద్ మోహినుద్దీన్,పిట్టల సూరిబాబు,కందరబోయిన గోపి,దేశబోయిన వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సిఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు


**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సిఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కూసుమంచి మండల కేంద్రంలోని పాలేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకి పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అవిశ్రాంత సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు,రైతు రుణమాఫీ,వరి బోనస్,మహిళలకు వడ్డీ లేని రుణాలు,యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సిఎం రేవంత్ రెడ్డి ముందుకి వెళ్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ హఫీజుద్దీన్,మాజీ సర్పంచ్ చెన్నా మోహన్,భారీ వీరభద్రం,చాట్ల పరశు రామ్,గుండా లింగారెడ్డి,కణతాల నాగయ్య,గుండా భూపాల్ రెడ్డి,శివారెడ్డి,యువజన నాయకుడు కుమార్, అంతోటీ వెంకన్న, బెల్లంకొండ కిరణ్, ఫణీందర్ రెడ్డి,బుచ్చిరెడ్డి,సైదులు,పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఐక్యవేదిక కార్యవర్గ సమావేశంలో నూతన ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. భవిష్య ప్రణాళిక సమాలోచనలు రాబోవు సంస్థ గత స్థానిక ఎన్నికలు జిహెచ్ఎంసి మున్సిపల్ ఎన్నికల గురించి సుదీర్ఘంగా చర్చించటం జరిగింది అధికారమే అంతిమ లక్ష్యంగా బీసీలు అందరూ ఏకమై ఐకమత్యంతో ఎస్సీ ఎస్టీ మైనార్టీల సహకారంతో బహుజన రాజ్యాధికారం సాధించాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించడం జరిగింది. విద్యా ఉద్యోగం ఉపాధి, వైద్యం లక్షలు లక్షల ఖర్చు ఉన్నందున, ఉచిత విద్య ఉచిత వైద్యం కల్పించాలని పేదరిక నిర్మూలనలో భాగంగా రోటి కప్పుడా మఖాన్ ఉపాధి ద్వారా కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. కార్యవర్గం స మీకరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల బిసి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్ ని నియమించి, నియామక పత్రం ను అధ్యక్షులైన బేరి రామచందర్ యాదవ్ చేతుల మీదుగా అందజేయడం జరిగిం ది. ఈ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ తో పాటు బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ వనపర్తి జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల అధ్యక్షులు మధు యాదవ్, ప్రధాన కార్యదర్శి బండి రామకృష్ణ గౌడ్, అతిథిగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డప్పు కొట్టు హరిబాబు, పాములేటి యాదవ్, సినీ ఆర్టిస్ట్ లక్ష్మీనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

# నోబెల్ శాస్త్రవేత్త జేమ్స్ డి వాట్సన్ కన్నుమూత



**న్యూయార్క్, నవంబర్ 8 :** జీవం ఉనికికి కారణమైన జన్యు పదార్థం డీఎన్ఏ నిర్మా ణాన్ని కనుగొన్న అమెరికన్ శాస్త్రవేత్త జేమ్స్ డి వాట్సన్ శుక్రవారం తుదిశ్వాస విడిచా రు. వృద్దాప్య సంబంధిత సమస్యలతో 97 వయసులో కన్నుమూశారు. న్యూయార్క్ లోని కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబొరేటరీ ఈ విషయాన్ని ధ్రువీకరించింది మెలికలు తిరిగిన నిచ్చెన ఆకారంలో ఉన్న డీఎన్ఏ నిర్మాణాన్ని డబుల్ హెలికల్ స్ట్రక్చర్ అని పిలుస్తారు. ఈ అమరికను కనుగొన్నందుకు బ్రిటన్ శాస్త్రవేత్త ఫ్రాంసిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్‌లతో కలిసి జేమ్స్ డీ వాట్సాన్ 1962లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమ తి పొందారు. డీఎన్ఏకు సంబంధించి రొసాలిండ్ ఫ్రాంక్లిన్, మారిస్ విల్కిన్స్ రూపొందించిన ఎక్స్ రే చిత్రాల ఆధారంగా వాట్సాన్, క్రిక్‌లు 1953లో డబుల్ హెలికల్ స్ట్రక్చర్‌ను వివరించారు. అయితే, 1958లోనే రోసాలిండ్ ఫ్రాంక్లిన్ కన్నుమూయడంతో ఆమెకు నోబెల్ బహుమతి దక్కలేదు. జేమ్స్ డీ వాట్సన్ 1928లో చికాగోలో జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన ఆ తరువాత ఇండియానా యూనివర్సిటీలో జన్యుశాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. 1951లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన కావెండిష్ లేబొరేటరీలో చేరారు. అక్కడే ఆయనకు క్రిక్ పరిచయమయ్యారు. ఆ తరువాత ఇద్దరూ కలిసి డీఎన్ఏ అమరిక గురించి తెలుసుకునేందుకు విస్తృత పరిశోధనలు చేశారు. చివరకు జీవం గురించి కీలక రహస్యాన్ని ఛేదించారు. మానవ జన్యుక్రమాన్ని తెలుసుకునేందుకు ప్రారంభించిన హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్టుకు జేమ్స్ 1990లో నేతృత్వం వహించారు. అయితే ప్రభుత్వ విధానాలతో విభేదించి కొంత కాలానికే తప్పుకున్నారు. జేమ్స్ తీరు కొన్ని సార్లు వివాదాలకూ దారి తీసింది. 2007లో ఓ పత్రికా ఇంటర్వ్యూలో ఆయన కామెంట్స్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆఫ్రికా జాతీయులతో పోలిస్తే శ్వేతజాతీయుల మేధోసామర్థ్యం ఎక్కువని కామెంట్ చేయడంపై కలకలం రేగింది. ఇక వాట్సన్, క్రిక్‌ల ఆవిష్కరణ జీవశాస్త్రంలో అనేక మార్పులను తెచ్చింది. జెనెటిక్ ఇంజినీరింగ్, జీన్ థెరపీ, బయోటెక్నాలజీ వంటి ఆధునిక శాస్త్రాలకు పురుడు పోసింది. డీఎన్ఏ ఆవిష్కరణకు సంబంధించి తన అనుభవాలను వివరిస్తూ వాట్సన్ 1968లో ది డబుల్ హెలిక్స్ అనే పుస్తకాన్ని కూడా రాశారు.

# నర్స్ పాపానికి పదిమంది పేషెంట్లు మృతి

**బెర్లిన్, నవంబర్ 8 :** రోగులకు సేవ చేసి వారి ప్రాణాలు కాపాడాల్సిన ఓ నర్స్ దారుణానికి ఒడిగట్టింది. ఏకంగా 10 మంది పేషెంట్లను చంపేసింది. మరో 27 మందిని చంపడానికి ప్రయత్నించింది. చివరకు పాపం పండి జైలు పాలైంది. తాజాగా, నర్సు కేసుపై విచారణ జరిపిన కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. జీవిత ఖైదు విధించింది. ఈ సంఘటన జర్మనీలో చోటుచేసుకుంది. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. జర్మనీలోని ఆచెన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ స్థానికంగా ఉండే ఆస్పత్రిలో నర్సుగా పని చేసేది. ఆమెకు తరచుగా నైట్ డ్యూటీలు పడుతూ ఉండేవి. ఆస్పత్రిలో పేషెంట్లు ఎక్కువగా ఉండటంతో పని చేయటం ఆమెకు ఇబ్బందిగా అనిపించింది. దీంతో ఓ దారుణమైన నిర్ణయం తీసుకుంది. వృద్ధ పేషెంట్లకు ఇంజెక్షన్లు ఇచ్చి చంపేసింది. 2023 డిసెంబర్ నుంచి మే 2024 మధ్య కాలంలో 10 మంది పేషెంట్లను చంపేసింది. మరో 27 మందిని చంపటానికి ప్రయత్నించి విఫలమైంది. ఆమె నైట్ డ్యూటీలో ఉన్నప్పుడే ఎక్కువ మంది చనిపోతుండటంతో ఆస్పత్రి ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. ఆమెను అరెస్ట్ చేశారు. అప్పటినుంచి కోర్టు ప్రొసీడింగ్స్ జరుగుతున్నాయి. బుధవారం ఆచెన్ కోర్టు ఈ కేసుపై విచారణ జరిపి తుది తీర్పు వెలువరించింది. ఆమెను దోషిగా తేల్చి, జీవిత ఖైదు విధించింది. దీనిపై కోర్టుకు సంబంధించిన అధికార ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. ఆమె 15 సంవత్సరాలకే విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ తీర్పుపై పైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు.



# బాలిక ఆత్మహత్య కేసులో కీలక విషయాలు

**జైపూర్ :** జైపుర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల బిల్డింగ్ పైనుంచి దూకి ఓ తొమ్మిదేళ్ల బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇటీవల తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో తోటి విద్యార్థుల వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆ బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్‌కు వెళ్లనంటూ తమ కుమార్తె ఏడుస్తున్న ఆడియోను మృతురాలి తల్లి మీడియాతో పంచుకున్నారు. 'నేను పాఠశాలకు వెళ్లాలనుకోవడం లేదు. నన్ను పంపించొద్దు ప్లీజ్' అని ఆ విద్యార్థిని అందులో వేడుకున్నట్లుంది. దీనిపై ఆమె తల్లి శివాని మీనా మాట్లాడుతూ.. "ఆ ఆడియోను క్లాస్ టీచర్‌తో పాటు కో-ఆర్డినేటర్‌కు పంపించి వారితో చాలాసార్లు మాట్లాడాను. అయినా వాళ్లు నా మాటలు పట్టించుకోలేదు. పాఠశాలలో నా కుమార్తెను ఆట పట్టించడం, బెదిరించడం, లైంగిక వేధింపుల వంటివి కొన్ని నెలల పాటు జరిగాయి" అంటూ ఆవేదన వెళ్లగక్కారు. తన కుమార్తె, మరో అబ్బాయిని ఉద్దేశిస్తూ తోటి విద్యార్థులు ఏడిపించారని బాలిక తండ్రి ఆరోపించారు. నవంబరు 1న జైపుర్‌లోని ప్రముఖ పాఠశాల నాల్గో అంతస్తు నుంచి దూకి తొమ్మిదేళ్ల విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఆమెను ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వైరల్ అయ్యాయి. సమాచారం అందుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికే.. ఆ విద్యార్థిని పడిన ప్రాంతంలో రక్తం మరకలు మాయమయ్యాయి. దీంతో ఆమె మరణంపై అనుమానాలు తీవ్రమయ్యాయి. పాఠశాల యాజమాన్యంపై విద్యార్థి తల్లిదండ్రులు కేసు పెట్టారు. ఈ ఘటనపై డీసీపీ రాజర్షి రాజ్‌వర్మ మాట్లాడుతూ.. విద్యార్థి తల్లిదండ్రుల స్టేట్‌మెంట్లు తీసుకున్నామన్నారు. వారి ఆరోపణల కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే ఈ ఆరోపణలపై పాఠశాల యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు.

# గవర్నర్ ఎన్నికల్లో వివేక్ రామస్వామి

## సంపూర్ణ మద్దతు ప్రకటించిన ట్రంప్



**న్యూయార్క్, నవంబర్ 8 :** ఇటీవల మూడు అమెరికా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తులు గెలుపొందిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్రమత్తమయ్యారు. ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో పోటీ పడుతున్న రిపబ్లికన్ నేత, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామికి తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఆయన సమ్‌థింగ్ స్పెషల్ అంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. వివేక్‌కు అండగా ఉండాలని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఒహాయోలో ఇప్పటికే వివేక్ తన సత్తాచాటారని గుర్తు చేశారు. వివేక్‌పై ట్రంప్ మద్దతుదారులు కొందరు జాత్యాహకారం ప్రదర్శిస్తున్న తరుణంలో ఈ పోస్టు ఆసక్తికరంగా మారింది. వివేక్‌పై ప్రశంసలు కురిపిస్తూ డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ పోస్టు పెట్టారు. 'నాకు వివేక్ బాగా తెలుసు. అధ్యక్ష ఎన్నికల్లో నాతో పోటీ పడ్డారు. అతడు యువకుడు.. చాలా స్మార్ట్. మన దేశమంటే ఆయనకు నిజంగా ఎంతో ఇష్టం' అని ప్రశంసలు కురిపించారు. ఒహాయో గవర్నర్ పదవికి పోటీ పడుతున్న వివేక్‌కు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపారు. 'మీ రాష్ట్ర గవర్నర్‌గా వివేక్.. ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారు. పన్నులు తగ్గించేందుకు, నిబంధనలను సరళతరం చేసేందుకు, మేడ్ ఇన్ యూఎస్ఏ విధానాన్ని ప్రోత్సహించేందుకు శ్రమిస్తారు' అంటూ స్పష్టంగా తన మద్దతు తెలిపారు. ఇంధన రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు, సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేసేందుకు వివేక్ కృషి చేస్తారని హామీ ఇచ్చారు. నేరాల నిర్మూలన, మిలిటరీ సిబ్బంది కోసం సంక్షేమ చర్యలు, లా అండ్ ఆర్డర్, ఎన్నికల వ్యవస్థ సమగ్రతను వివేక్ కాపాడతారని తెలిపారు. అమెరికా రాజ్యాంగంలోని రెండో అమెండ్‌మెంట్‌కు (తుపాకీని కలిగి ఉండే హక్కు) రక్షణగా నిలుస్తారని కూడా ట్రంప్ చెప్పారు. అమెరికన్లను వివేక్ ఎప్పుడూ నిరాశ పరచరని హామీ ఇచ్చారు. ఒహాయోకు అద్భుత గవర్నర్‌గా వివేక్ నిలుస్తారని తాను స్వయంగా హామీ ఇస్తున్నానని అన్నారు.

# లాలూ తరహాలో కుంభకోణాలు చేయలేరు

## కేంద్ర మంత్రి అమిత్ షా



**పూర్ణియా :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లు 'సీమాంచల్'ను చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా ఆరోపించారు. పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి దేశం నుంచి బహిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా తేజస్వీ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ.. ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోదీ కుంభకోణాలు చేయలేరని చురకలంటించారు. "బిహార్‌లో 160 స్థానాల్లో విజయం సాధించి ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సగం రాష్ట్రం కాంగ్రెస్-ఆర్జేడీ కూటమికి తలుపులు మూసివేసింది. రాహుల్, తేజస్వీలు కలిసి సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, ఎన్నికల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తాం. వారి దేశానికి పంపిస్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు. రైల్వేలో లాలూ ప్రసాద్ యాదవ్ తీసుకొచ్చిన లాభాలను ప్రధాని మోదీ ఏడు జన్మలెత్తినా తీసుకురాలేరంటూ ఇటీవల తేజస్వీ యాదవ్ చేసిన విమర్శలకు గట్టిగా బదులిచ్చారు. ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోదీ కుంభకోణాలు చేయలేరంటూ ధ్వజమెత్తారు.

### 'ఓటు చోరీ' ఆరోపణలు నిరాధారం..

రాష్ట్రంలో ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమైనవని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. వాటికి సంబంధించి ఏమైనా ఆధారాలు ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని సూచించారు. రోహ్‌తాస్‌లో ఎన్నికల ప్రచార సభలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, అందుకే ఆ పార్టీ నేత అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కులం, మతం పేరుతో కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. సాయుధ బలగాలను రాజకీయాల్లోకి లాగొద్దని ఈ సందర్భంగా రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



# ఆపరేషన్ పింపుల్..

## ఇద్దరు ఉగ్రవాదుల హతం

**కుప్వాడా :** జమ్మూకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లాలో భద్రతా బలగాలు ఆపరేషన్ పింపుల్‌ను నిర్వహిస్తున్నాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ విషయాన్ని శనివారం భారత సైన్యానికి చెందిన చినార్ కోర్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. "ఉగ్రవాదులు చొరబాటుకు యత్నిస్తున్నారన్న నిఘా సమాచారం ఆధారంగా నవంబర్ 7న కుప్వాడాలో ఆపరేషన్ పింపుల్ చేపట్టాం. ఈ క్రమంలో ఉగ్ర మూకలు విచక్షణా రహితంగా కాల్పులకు పాల్పడ్డారు" అని వెల్లడించింది. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొంది. ఈ వారంలో భద్రతా బలగాలు ఆపరేషన్ ఛత్రును చేపట్టిన సంగతి తెలిసిందే. కిష్తివాడ్ జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టారు.

# అదుపుతప్పి ఢీకొట్టిన కారు..

## ముగ్గురి మృతి




**కాకినాడ :** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు టైరు పేలడంతో.. అదుపుతప్పి ఆరుగురి పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సోమవరానికి చెందిన కొండబాబు (30), ఆనందరావు(60), ఏలేశ్వరానికి చెందిన రాజు(60)గా గుర్తించారు. బస్సు షెల్టర్‌లో ప్రయాణికులు ఉండగా ఆరుగురిపైకి ఈ కారు దూసుకెళ్లింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘటనాస్థలికి హుటాహుటిన వెళ్లి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు

# మహారాష్ట్రలో మరో భూకుంభకోణం

## రూ.200కోట్ల విలువైన భూమి రూ.3 కోట్లకే...



**మహారాష్ట్ర :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూ కుంభకోణం కేసు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరో భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ.200 కోట్ల విలువైన భూమిని.. రూ.3 కోట్లకే దక్కించుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయందర్‌లో దాదాపు రూ.200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ.3 కోట్లకు కొనుగోలు చేశారని ఆరోపించారు. అక్కడ ఆయన ఓ విద్యాసంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. దీని గురించి తాను కూడా విన్నానని.. కానీ, దీనిపై ఇప్పటివరకు ఎవరినుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం కాకుండా.. మీడియా ముందుకొచ్చి ఆరోపణలు చేసేందుకు సమయం కేటాయిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తాము తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. రూ.18, 000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన అమెడియా ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.300 కోట్లకే విక్రయించినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో దోషులుగా తేలినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ క్రమంలో మంత్రి ప్రతాప్ సర్‌నాయక్‌పై కూడా ఇలాంటి ఆరోపణలే రావడం చర్చనీయాంశంగా మారింది.




# హెచ్-1బీ దుర్వినియోగంపై ట్రంప్ 'ఫైర్‌వాల్'

## 175 కేసుల్లో దర్యాప్తు

**యూఎస్ :** హెచ్-1బీ వీసా దుర్వినియోగం వల్ల విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తోంది. అందులోభాగంగా కార్మిక శాఖ సెప్టెంబర్‌లో ప్రాజెక్ట్ ఫైర్‌వాల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దానికింద ఈ వీసా అవకతవకలపై దర్యాప్తు ప్రారంభించిన కార్మిక శాఖ 175 కేసులు నమోదు చేసింది. ఈ మేరకు అమెరికా మీడియా సంస్థ కథనం పేర్కొంది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాతే కార్మికశాఖ ప్రాజెక్ట్ ఫైర్‌వాల్‌ను ప్రారంభించింది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులతో కంపెనీలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా చూడటమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం. అలాంటి దుర్వినియోగంపై లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తున్నామని ఆ శాఖ మంత్రి లోరి చావెజ్ వెల్లడించారు. అయితే ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలను మాత్రం బయటపెట్టలేదు. అధ్యక్షుడి నాయకత్వంలో అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు మొదట అమెరికా కార్మికులకే వెళ్లేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కార్మికశాఖ ఒక వీడియోను రూపొందించిన సంగతి తెలిసిందే. "హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తున్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం" అని అందులో ప్రస్తావించింది. హెచ్-1బీల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని వీడియోలో భాగంగా ఓ గ్రాఫ్‌లో చూపించిన సంగతి తెలిసిందే.



# వియత్నాంలో బీభత్సం సృష్టించిన తుపాన్

## వేలాదిగా నేలమట్టం అయిన ఇళ్లు

**న్యూఢిల్లీ, నవంబర్ 8 :** ఫిలిప్పీన్స్ దేశాన్ని అతలాకుతలం చేసిన కాల్మెగీ తుపాను వియత్నాంలో కూడా బీభత్సం సృష్టించింది. గియా లాయ్, డాక్ లక్ ప్రావిన్సుల్లో వేల కొద్దీ ఇళ్లు దెబ్బతిన్నాయి. వాటి పైప్పులు తుపాను గాలులకు కొట్టుకుపోయాయి. మరికొన్ని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. గంటకు దాదాపు 149 కిలోమీటర్ల వేగంతో భయానక గాలులు వీచడంతో ప్రజలు బెంబేలు పడ్డారు. వియత్నాం ఎదుర్కొన్న భారీ తుపాన్లలో ఇదీ ఒకటని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుపానుతో ఎంత నష్టం జరిగిందో అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు. సుమారు 2600 ఇళ్లకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఒక్క గియా లాయ్ ప్రావిన్స్‌లోనే సుమారు 2400 ఇళ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. 57 ఇళ్లు పూర్తిగా నేలమట్టం అయ్యాయని అన్నారు. డాక్ లాక్ ప్రావిన్స్‌లో ముగ్గురు, గియా లాయ్ ప్రావిన్స్‌లో ఇద్దరు మరణించారు. పొరుగున ఉన్న కాంగ్ ఎన్‌గాయ్ ప్రావిన్స్‌లో గల్లంతైన ముగ్గురి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. తుపాను బీభత్సానికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. చెట్లు నేలకూలడం, విద్యుత్ తీగలు తెగడంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. భీకర గాలుల ధాటికి అనేక ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. ఇక కాల్మెగీ కారణంగా ఫిలిప్పీన్స్‌లో దాదాపు 200 మంది మరణించారు. 135 మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఈ వారం మొదట్లో ఫిలిప్పీన్స్ తీరాన్ని తాకిన కాల్మెగీ తుపాను ఆ తరువాత వియత్నాంలో బీభత్సం సృష్టించింది. ప్రస్తుతం కాస్త బలహీనపడి పొరుగున ఉన్న కాంబోడియాలో ప్రవేశించింది. అయితే, ఫిలిప్పీన్స్‌కు సమీపంలోని సముద్ర జలాల్లో మరో తుపాను రూపుదిద్దుకుంటుండటంతో దేశ ప్రధాని ఫెర్డినాండ్ మార్కోస్ గురువారం జాతీయ ఎమ్జర్గెన్సీ ప్రకటించారు. వాతావరణ మార్పుల కారణంగా ఆగ్నేయ ఆసియాలో తుపాన్లు, వరదల తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# మాలీలో ఐదుగురు భారతీయుల కిడ్నాప్

## ఆల్‌ఖైదా అనుబంధ సంస్థ దురాగతం

**న్యూఢిల్లీ, నవంబర్ 8 :** ఆఫ్రికా దేశం మాలీలో ఐదుగురు భారతీయులను ఉగ్రమూకలు కిడ్నాప్ చేశాయి. ఇది అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న మూకల పనేనని అక్కడి వార్గాలు చెబుతున్నాయి. స్థానికంగా ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టు చేపడుతున్న సంస్థలో ఆ ఐదుగురు పనిచేస్తున్నారు. వారు కిడ్నాప్‌కు గురైన విషయాన్ని సంస్థ ధ్రువీకరించింది. రాజధాని బొమాకోలోని మిగతా భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. అయితే, ఈ విషయంపై అక్కడి ఉగ్రవాద సంస్థలు ఏవీ ఇంకా స్పందించలేదు. మాలీలో ప్రస్తుతం మిలటరీ జంటా పాలన సాగుతోంది. మరోవైపు అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థలకు అనుబంధంగా పనిచేస్తున్న ఉగ్రమూకలు దేశంలో రణరంగం సృష్టిస్తున్నాయి. వారికి అడ్డుకట్ట వేయలేక సైన్యం నానా కష్టాలు పడుతోంది. అసలే ఆర్థికకష్టాల్లో ఉన్న దేశంలో అంతర్గత కుమ్ములాటలు పరిస్థితిని నానాటికీ దిగజారుస్తున్నాయి. అల్ ఖైదా అనుబంధ జేఎన్ఐఎమ్ ఉగ్రసంస్థ దేశంలోకి ఇంధనం రాకుండా అడ్డుకోవడంతో అవస్థలు తీవ్రమయ్యాయి. మాలీలో విదేశీయుల అపహరణలు నిత్యకృత్యంగా మారాయి. వర్గాల మధ్య కుమ్ములాటలతో మాలీ 2012 నుంచి అల్లకల్లోలంగా మారింది. సెప్టెంబర్‌లో కూడా జేఎన్ఐఎమ్ ఉగ్రవాదులు విదేశీయులను కిడ్నాప్ చేశారు. యూఏఈకి చెందిన ఇద్దరిని, ఒక ఇరాన్ దేశస్థుడిని బొమాకోకు సమీపంలో కిడ్నాప్ చేశారు. 50 మిలియన్ డాలర్లు ఇచ్చాక వారిని విడిచిపెట్టారు.

# నాడు పుజారా కెరీర్‌ను కాపాడిన షారుక్



భారత టెస్టు క్రికెట్‌లో ఛతేశ్వర్ పుజారా చాలాకాలం పాటు కీలక బ్యాటర్‌గా ఉన్నాడు. ఎన్నో మ్యాచ్‌ల్లో మేటి ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే, ఇతను పొట్టి ఫార్మాట్‌లో సక్సెస్ కాలేకపోయాడు. అంతర్జాతీయ టీ20ల్లోకి ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయిన పుజారా ఐపీఎల్ కొన్ని సీజన్లు ఆడినా పెద్దగా ప్రభావం చూపలేదు. 2008 దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన ఛతేశ్వర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులోకి తీసుకుంది. భారత్‌లో సార్వత్రిక ఎన్నికల కారణంగా 2009 ఐపీఎల్ సీజన్ దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. అప్పుడు ప్రాక్టీస్ మ్యాచ్‌లో పుజారా గాయపడగా వెంటనే కేకేఆర్ యాజమాన్యం స్పందించింది. కేప్ టౌన్‌లో పుజారా శస్త్రచికిత్స కోసం ఏర్పాట్లు చేసింది. నిపుణులైన వైద్యులు ఉండటంతో దక్షిణాఫ్రికాలోనే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమమని కేకేఆర్ యజమాని షారుక్ ఖాన్.. పుజారాను ఒప్పించాడు. ఈ విషయాన్ని పుజారా భార్య పూజ తాను రాసిన 'ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' పుస్తకంలో ప్రస్తావించారు. 'శస్త్రచికిత్స చేయిస్తున్నందున పుజారాకు తోడుగా ఉండటానికి ఎవరైనా దక్షిణాఫ్రికా వస్తామంటే ఏర్పాట్లు చేస్తాం. అందుకు అయ్యే ఖర్చులను తామే భరిస్తామని కేకేఆర్ యాజమాన్యం చెప్పింది. కొన్ని రోజులకే పుజారా తండ్రి, డాక్టర్ షా కేప్ టౌన్‌కు వెళ్లారు' అని పూజ తన పుస్తకంలో పేర్కొన్నారు. శస్త్రచికిత్స విజయవంతమై పూర్తిగా కోలుకున్న ఛతేశ్వర్ తర్వాత ఐదు సీజన్ల పాటు ఐపీఎల్‌లో ఆడినా పెద్దగా రాణించలేకపోయాడు.






## మ్యాచ్‌లు గెలుస్తున్నంత వరకు టాస్ ఓడిపోయినా సమస్య లేదు

గబ్బా వేదికగా టీమ్ఇండియా, ఆస్ట్రేలియాతో అయిదో టీ20లో తలపడుతోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు మరోసారి టాస్ ఓడిపోయింది. గెలిచిన ఆసీస్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో టాస్ అనంతరం టీమ్ఇండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను.. 'మళ్లీ ఓడిపోయావా?!' అంటూ.. ఆట పట్టించాడు. బుమ్రా వేసిన ప్రశ్నకు సమాధానంగా సూర్య నవ్వుతూ.. బ్యాటింగ్ చేయబోతున్నాం.. అని చేతితో సైగ చేసి చూపించాడు. అంతకు ముందు.. సూర్యకుమార్ యాదవ్.. రవిశాస్త్రితో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. 'మ్యాచ్‌లు గెలుస్తున్నంత వరకు టాస్ ఓడిపోయినా.. పెద్ద సమస్య లేదు' అని అతడు అన్నాడు. ప్రస్తుతం టీమ్ఇండియా ఈ సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్‌ను కూడా గెలిచి సిరీస్ విజేతగా నిలవాలని చూస్తోంది. టీమ్ఇండియా ఈ ఆస్ట్రేలియా టూర్‌లో 8 టాస్‌ల్లో 7 సార్లు ఓడిపోయింది. వన్డేల్లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమ్ఇండియా మూడు మ్యాచుల్లో టాస్‌లు ఓడిపోయింది. అయిదు టీ20ల్లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే (మూడో టీ20) టాస్ గెలిచాడు. భారత జట్టు గత 12 నెలలుగా ఎక్కువ శాతం టాస్‌లు ఓడిపోతూనే వస్తోంది.




## వర్షం కారణంగా మ్యాచ్ రద్దు
### టీమ్ఇండియానే టీ20 సిరీస్ విజేత



**బ్రిస్బేన్ :** బ్రిస్బేన్ వేదికగా టీమ్ఇండియా, ఆస్ట్రేలియా జట్లు అయిదో టీ20లో పోటీపడ్డాయి. అయితే ఈ మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. తొలుత టాస్ గెలిచిన ఆసీస్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ ప్రారంభించిన భారత జట్టు ఆట ఆగే సమయానికి 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. టీమ్ ఇండియా ఓపెనర్లు అభిషేక్ శర్మ (23, 13 బంతుల్లో 1ఫోర్, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (29, 16 బంతుల్లో, 6 ఫోర్లు) నాటౌట్‌గా నిలిచారు. ఆటలో వేగం పుంజుకుంటున్న సమయంలోనే ఉన్నట్లుండి ఉరుములు, మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా కఠినంగా మారడంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. తర్వాత వర్షం కూడా ప్రారంభమైంది. ఆటను తిరిగి ప్రారంభించే అవకాశం లేకపోవడంతో కాసేపటి తర్వాత అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో ఈ సిరీస్‌ను టీమ్ఇండియా 2–1 తేడాతో కైవసం చేసుకుంది. మొదటి మ్యాచ్ కూడా వర్షార్పణమైన విషయం తెలిసిందే. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు.



## డిజిటల్ గోల్డ్ కొనుగోలుదారులకు సెబీ అలర్ట్

బంగారంలో పెట్టుబడుల కోసం చాలా మంది ఇటీవల కాలంలో డిజిటల్ గోల్డ్‌పై ఆధారపడుతున్నారు. ఎక్కడికీ వెళ్లే పని లేకుండా, ఇంటి నుంచే కొనుగోలుకు అవకాశం ఉండడంతో ఈ తరహా కొనుగోళ్లకు ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కీలక ప్రకటన చేసింది. డిజిటల్ లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో లభించే గోల్డ్ ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మదుపర్లకు సూచించింది. దీనివల్ల ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందంటూ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. "కొన్ని డిజిటల్/ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు పెట్టుబడిదారులకు డిజిటల్ గోల్డ్/ఇ–గోల్డ్ ప్రొడక్టులను అందిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. భౌతిక బంగారంలో పెట్టుబడికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ ప్రాచుర్యం పొందింది. అటువంటి డిజిటల్ గోల్డ్ ఉత్పత్తులు సెబీ నియంత్రణ పరిధిలోకి రావు. ప్రస్తుత చట్టాల ప్రకారం అవి సెక్యూరిటీలు గానీ, కమోడిటీ డెరివేటివ్‌లు కావు కాబట్టి వాటికి సెబీ నియంత్రణ వర్తించదు. అవి పూర్తిగా సెబీ వెలుపల పనిచేస్తాయి. అలాంటి ఉత్పత్తులకు సెక్యూరిటీల మార్కెట్ పరిధిలోని పెట్టుబడిదారుల రక్షణ విధానాలు ఏవీ వర్తించవు" అని సెబీ తన ప్రకటనలో పేర్కొంది. డిజిటల్ గోల్డ్‌లో కౌంటర్‌పార్టీ, ఆపరేషనల్ రిస్కులు పొంచి ఉంటాయని హెచ్చరించింది. అంటే సదరు ప్లాట్‌ఫామ్ తిరిగి డబ్బు చెల్లించలేకపోవడం, నిర్వహణపరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉంటుందని పేర్కొంది. మ్యూచువల్ ఫండ్స్ అందించే ఎక్స్ఛేంజ్ ట్రేటెడ్ ఫండ్స్, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్‌లులు వంటివి సెబీ పరిధిలోకి వస్తాయని తెలిపింది. వీటిని రిజిస్టర్డ్ మధ్యవర్తుల నుంచి కొనుగోలు చేయొచ్చని తెలిపింది.



## వాట్సప్ ఫొటోలతో.. శాంసంగ్ ఫోన్లపై టార్గెట్..

సైబర్ నేరగాళ్లు శాంసంగ్ ఫోన్లను టార్గెట్ చేస్తున్నారు. గుర్తుతెలియని ఖాతాల నుంచి తమ వాట్సప్‌కు వచ్చే చిత్రాలను తెరిచేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిందే. వాటిని క్లిక్ చేయగానే చడీచప్పుడు లేకుండా మన ఫోన్‌లోకి మాల్‌వేర్ ప్రవేశిస్తుంది. శాంసంగ్ సాఫ్ట్‌వేర్‌లోని లోపాన్ని ఉపయోగించుకొని ల్యాండ్‌ఫాల్ స్పైవేర్‌ను జొప్పించి సైబర్ నేరగాళ్లు సమాచారం సేకరిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ ఫోన్లపై హ్యాకింగ్‌కు పాల్పడుతున్నట్లు అమెరికాకు చెందిన పాలోఆల్టో నెట్‌వర్క్ సంస్థ వెల్లడించింది. ఒకసారి ఈ వైరస్ ఫోన్‌లోకి చొరబడిన తర్వాత ఒక స్పైలా ప్రవర్తిస్తుంది. కాల్స్‌పై నిఘా పెడుతుంది. లొకేషన్‌ను ట్రాక్ చేస్తుంది. కాంటాక్ట్‌లను గమనిస్తుంది. ఇరాన్, ఇరాక్, మొరాకో, తుర్కియే వంటి దేశాల్లో ఎస్22, ఎస్23, ఎస్24, జెడ్‌ఫోల్డ్ 4, జెడ్ ఫ్లిప్ 4 యూజర్లను హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. 2024 ఏడాది మధ్య ఈ స్పైవేర్ వెలుగులోకి వచ్చింది. అప్పటికే నెలలుగా అది ఫోన్‌లో రన్ అయిందని ఆ సంస్థ గుర్తించింది. సెప్టెంబర్ 2024లోనే దీనిపై శాంసంగ్‌కు సమాచారం అందించినా కానీ ఏప్రిల్ 2025లో దీనిపై చర్యలు ప్రారంభించిందని పేర్కొంది. దాంతో దాదాపు ఆరు నెలల పాటు ఆ ఫోన్ల నుంచి హ్యాకర్లు సమాచారం సేకరించి ఉంటారని వెల్లడించింది. ఇప్పుడు శాంసంగ్ ఫోన్లలోని సాఫ్ట్‌వేర్ లోపం పరిష్కారమైంది. అయితే హ్యాకర్లకు ఏ ఫోన్లు అతీతం కాదని ఈ పరిణామం బట్టి తెలుస్తోంది. గూగుల్‌కు చెందిన వైరల్ టోటల్ అనేది పబ్లిక్ మాల్వేర్ డేటాబేస్. అందులోకి అనుమానాస్పద ఫైల్స్‌ను అప్‌లోడ్ చేస్తుంటారు. అప్పుడే పాలోఆల్టో నెట్‌వర్క్ ఆధ్వర్యంలోని యూనిట్ 42 ఈ సైబర్ నేరాన్ని గుర్తించింది. కొందరిని టార్గెట్ చేసే ఈ మాల్వేర్‌ను జొప్పించి ఉండొచ్చని వెల్లడించింది. ఈ వ్యవహారంలో ఆర్థిక దోపిడీ కంటే గూఢచర్యమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని అనుమానం వ్యక్తంచేసింది. ఫోన్లను అప్‌డేట్ చేసుకున్న శాంసంగ్ యూజర్లు సురక్షితమేనని పేర్కొంది.



## 2028 ఒలింపిక్స్..
### భారత్ -పాక్ పోరు లేనట్లేనా..?

అంతర్జాతీయ టోర్నీల్లో భారత్–పాకిస్థాన్ మ్యాచ్ అంటే క్రికెట్ అభిమానులకు పండగే. అయితే, 2028 ఒలింపిక్స్‌లో మాత్రం దాయాదుల పోరు జరిగే అవకాశాలు కన్పించట్లేదు. ఐసీసీ రూపొందించిన కొత్త రూల్స్‌తో భారత్–పాక్ మ్యాచ్ జరగడం అనుమానమే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలం తర్వాత ఒలింపిక్స్‌లో ఈసారి క్రికెట్‌ను కూడా చేర్చిన సంగతి తెలిసిందే. 2028లో లాస్ ఏంజెలెస్ వేదికగా జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ఎలా నిర్వహించాలన్న దానిపై ఐసీసీ కొన్ని నిబంధనలు రూపొందించింది. తాజాగా దుబాయ్‌లో జరిగిన సమావేశంలో వీటిని ఖరారు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఆరు జట్లు చొప్పున పురుషులు, మహిళల జట్లు ఈ టోర్నీలో పాల్గొననున్నాయి. ప్రాంతీయ అర్హతతో ఈ జట్లను ఎంపిక చేయాలని ఐసీసీ నిర్ణయించినట్లు సమాచారం. ఈ లెక్కన ఆసియా, ఓషియానియా, యూరప్, ఆఫ్రికా రీజినల్స్‌లో టాప్‌లో ఉన్న జట్లకు ఒలింపిక్స్‌లో నేరుగా ప్రవేశం లభిస్తుంది. ఇక ఆతిథ్య దేశానికి చోటు దక్కనుంది. ఆరో జట్టును క్వాలిఫయర్ రౌండ్ ఏర్పాటుచేసి నిర్ణయిస్తారు. ఐసీసీ ర్యాంకుల ప్రకారం ఆసియా నుంచి భారత్, ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా, యూరప్ నుంచి ఇంగ్లాండ్ జట్లు అర్హత సాధించే అవకాశం ఉంది. ఈ ఒలింపిక్స్‌కు అమెరికా, వెస్టిండీస్ ఆతిథ్యం కల్పిస్తున్నాయి. ఈ రెండింటిలో ఒక జట్టును ఎంపిక చేయనున్నారు. ఇక, ఆరో స్థానం కోసం క్వాలిఫయర్ పోటీలపై త్వరలోనే ఐసీసీ ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఒలింపిక్స్ గ్లోబల్ ఈవెంట్ కనుక అన్ని ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం ఉండేందుకు ఒక్కో రీజియన్ నుంచి ఒక్కో జట్టును ఎంపిక చేసి క్వాలిఫయర్ రౌండ్ నిర్వహించే అవకాశం ఉంది. అలా చూస్తే ఆసియాలో ర్యాంకింగ్స్ ప్రకారం పాక్‌కు ప్రాతినిధ్యం దక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అదే జరిగితే ఈ టోర్నీలో భారత్–పాక్ మ్యాచ్ ఉండకపోవచ్చు..! 128 ఏళ్ల తర్వాత 2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో ఈసారి క్రికెట్‌కు చోటు దక్కింది. టీ20 ఫార్మాట్‌లో పురుషులు, మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయి. ఒలింపిక్స్‌లో తొలిసారి, చివరిసారిగా 1900 సంవత్సరంలో క్రికెట్ నిర్వహించారు. అప్పుడు డెవాన్ అండ్ సోమర్‌సెట్ వండరర్స్ క్లబ్ (బ్రిటన్), ఫ్రెంచ్ అథ్లెటిక్ క్లబ్ యూనియన్ (ఫ్రాన్స్) మధ్య రెండు రోజుల మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో బ్రిటన్ విజేతగా నిలిచింది.

## ఆసియా కప్ ట్రోఫీ వివాదం..
### కమిటీ ఏర్పాటు చేసిన ఐసీసీ



ఆసియా కప్ వివాదాన్ని పరిష్కరించేందుకు ఐసీసీ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. శుక్రవారం జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమ్ఇండియా.. ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతులమీదుగా టైటిల్ అందుకోవడానికి నిరాకరించింది. తన చేతులమీదుగా భారత్ ఆటగాళ్లు ట్రోఫీ అందుకోవాలని నఖ్వీ పంతానికి పోవడంతో ఆ వివాదం మరింత ముదిరింది. ఈ విషయాన్ని శుక్రవారం జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ ప్రస్తావించింది. తమకు ట్రోఫీని అందించేలా చూడాలని ఐసీసీని కోరింది. ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు మధ్యవర్తిత్వం చేస్తామని అంగీకారం తెలిపిన ఐసీసీ.. వివాదాన్ని పరిష్కరించేందుకు ఓ కమిటీని వేసింది. బీసీసీఐ, పీసీబీ రెండింటితోనూ సత్సంబంధాలు కలిగిఉన్న ఒమన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ పంకజ్ ఖిమ్జీ ఈ కమిటీకి నాయకత్వం వహిస్తారని ఐసీసీ తెలిపింది. ఐసీసీ సమావేశానికి పది రోజుల ముందు బీసీసీఐ నఖ్వీకి లేఖ రాసి ట్రోఫీని భారత జట్టుకు అప్పగించాలని కోరింది. నవంబర్ 10న దుబాయ్‌లో ప్రత్యేక కార్యక్రమంలో ట్రోఫీని ప్రదానం చేస్తానని నఖ్వీ పేర్కొనగా.. బీసీసీఐ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. నఖ్వీ నుంచి నేరుగా ట్రోఫీని తీసుకోవడానికి అంగీకరించమని బీసీసీఐ కార్యదర్శి సైకియా స్పష్టంచేశారు. జట్టు అలా చేయడానికి సిద్ధంగా ఉంటే ఫైనల్ ముగిసిన వెంటనే అందుకు అంగీకరించి ఉండేదన్నారు. ఈ నేపథ్యంలో ట్రోఫీ వివాదాన్ని పరిష్కరించడానికి ఐసీసీ మధ్యవర్తిత్వం వహిస్తోంది.

## సామరస్యంగా పరిష్కరించుకుంటాం : బీసీసీఐ



ఆసియా కప్ ట్రోఫీ వివాదాన్ని సామ–రస్యంగా పరిష్కరించు కోవాలని బీసీసీఐ, పీసీబీ చీఫ్ నఖ్వీ.. ఒక అభిప్రాయానికి వచ్చారని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. దుబాయ్‌లో ఐసీసీ సమావేశం సందర్భంగా.. నఖ్వీతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, వివాద పరిష్కారానికి ఇరు పక్షాలూ సానుకూలంగా ఉన్నాయని ఆయన వెల్లడిం చారు. 'ఐసీసీ సమావేశానికి పీసీబీ ఛైర్మన్ నఖ్వీ కూడా హాజరయ్యారు. అజెండాలో లేనప్పటికీ నేను, నఖ్వీ.. ఐసీసీ అధికారుల సమక్షంలో భేటీ అయ్యాం. చర్చల ప్రక్రియ ప్రారంభం కావడం బాగుంది. ఇరు పక్షాలూ ఈ సమావేశం లో సహృదయంతో పాల్గొన్నాయి. ఆసియా కప్ ట్రోఫీ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుంటాం' అని బీసీసీ సెక్రటరీ దేవజిత్ సైకియా ఓ వార్తా సంస్థతో తెలిపారు. టీమ్ఇండియా సెప్టెంబర్ 28న ఆసియా కప్ ఫైనల్‌లో పాక్‌ను ఓడించి విజేతగా నిలిచింది. అయితే పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పహల్గాంపై దాడి చేసిన నేపథ్యంలో భారత ఆటగాళ్లు.. పాక్ క్రికెటర్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. అలాగే ఆ దేశానికి చెందిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ నఖ్వీ నుంచి ట్రోఫీ అందుకోవడానికి కూడా ఆసక్తి చూపలేదు. అయితే ఆయన మరొకరి చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్స్‌ను అందించే ప్రయత్నం చేయకుండా వాటిని తనతోపాటు తీసుకెళ్లాడు. అప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది.




## మంగళవారం ఐదైతే పనికి ఫుల్‌స్టాప్..
### నెట్‌ఫ్లిక్స్ సహ వ్యవస్థాపకుడు మార్క్ రాండోల్ఫ్

వర్క్‌లైఫ్ బ్యాలెన్స్.. చాలా మంది బాస్‌లు దీన్ని కొట్టిపారేస్తుంటారు. అదంతా ఉత్తిదే అని వాదిస్తుంటారు. గడియారం చూసుకుంటూ పనిచేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించలేం.. పైకెదగలేం అంటారు. గడిచిన కొన్నేళ్లుగా ఈ అంశంపై ఎడతెగని చర్చ నడుస్తోంది. ఉద్యోగ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతూకం ఉండాలనేది ఉద్యోగుల వాదన. వారం చివర పనిచేస్తేనే 'ఫ్యూచర్' ఉంటుంది అంటారు బాస్‌లు. కానీ, గడిచిన 30 ఏళ్లుగా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌కు పెద్దపీట వేస్తున్నారు నెట్‌ఫ్లిక్స్ సహ వ్యవస్థాపకుడు మార్క్ రాండోల్ఫ్. మంగళవారం సాయంత్రం ఐదైతే 'పెన్‌డౌన్' పాటిస్తున్నారు. ప్రముఖ గ్లోబల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన నెట్‌ఫ్లిక్స్‌ను స్థాపించిన వారిలో ఒకరైన రాండోల్ఫ్ మూడు దశాబ్దాలుగా ఈ పద్ధతిని పాటిస్తున్నారు. ఎన్ని పనులు ఉన్నా సాయంత్రం ఐదు గంటలు కాగానే తన విధులు ముగిస్తానని తన లింక్డిన్ పోస్టులో చెప్పుకొచ్చారు. ఈ పోస్ట్ పాతదే అయినా ప్రస్తుతం మరోసారి వైరల్ అవుతోంది. తన జీవితమంతా ఎంతో కష్టపడి పనిచేశానని, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ కోసం మాత్రం ఆ ఒక్కరోజు తనకు నచ్చినట్లు గడుపుతానంటూ తన పోస్టులో చెప్పుకొచ్చారు. "ప్రతి మంగళవారం సాయంత్రం ఐదు గంటలు కాగానే నా పని ముగిస్తా. గడిచిన 30 ఏళ్లుగా ఇదే పద్ధతిని పాటిస్తున్నా. ఆ రోజు ఎండైనా వానైనా సరే ప్లాన్‌లో ఎలాంటి మార్పు ఉండదు. ఆ రోజు నా స్నేహితుడితో కలిసి సినిమాకో, డిన్నర్‌కో వెళతా. ఏమీ లేకపోతే విండో షాపింగ్ చేస్తా. ఆ రోజు ఎలాంటి కాన్ఫరెన్స్ కాల్స్ పెట్టుకోను. ఎంత పెద్ద చిక్కొచ్చినా 4.55 గంటలకల్లా నా పనిని ముగించుకుంటా" అంటూ రాండోల్ఫ్ చెప్పుకొచ్చారు. మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం, దృష్టికోణంలో మార్పు ఉండకూడదన్న ఉద్దేశంతోనే తాను 'సరిపోదా మంగళవారం' రూల్‌ను పాటిస్తున్నా అంటూ చెప్పుకొచ్చారు.



# ఓటీటీలోకి 'కె-ర్యాంప్'

## అధికారికంగా ప్రకటించిన సంస్థ

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం కె- ర్యాంప్ . ఇటీవల విడుదలైన ఈ సినిమా మాస్ ఆడియన్స్‌కు వినోదాన్ని పంచింది. ఇందులోని కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో ట్రెండ్ సృష్టించాయి. దీంతో ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురుచూశారు. తాజాగా ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓటీటీ తేదీని ఆహా ప్రకటించింది. నవంబర్ 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా వెల్లడించింది. జైన్స్ నాని దర్శకత్వం వహించిన నరేష్ వీకే, సాయికుమార్, కామ్నా జెఠ్మలానీ కీలక పాత్రల్లో నటించారు. ధనవంతుడి కుటుంబంలో పుట్టి పెరిగిన కుర్రాడు కుమార్ అబ్బవరం (కిరణ్ అబ్బవరం). తండ్రి (సాయికుమార్) గారాబంతో చదువుని నిర్లక్ష్యం చేస్తూ, స్నేహితులతో కలిసి బలాదూర్‌గా తిరుగుతుంటాడు. అతన్ని దారిలో పెట్టాలని పండితుడి సలహాతో కేరళలోని ఓ కళాశాలలో చేర్చుతాడు తండ్రి. అక్కడికి వెళ్లిన కుమార్ తన మామ (నరేశ్)తో స్నేహంగా ఉంటూ, ఎప్పట్లాగే అల్లరిచిల్లరిగా గడుపుతుంటాడు. బాగా మద్యం తాగి ఊపిరాడక ఇబ్బందిపడుతున్న ఓ సందర్భంలో కుమార్‌ని చూసిన మెర్సీ జాయ్ (యుక్తి తరేజా) ఊపిరి పోసి, ఆ ప్రమాదం నుంచి గట్టెక్కిస్తుంది. తీరా మెర్సీ జాయ్ కళాశాలలో తన సహాధ్యాయిని అని తెలుస్తుంది. అలా తొలి చూపులోనే ప్రేమలో పడిపోయిన కుమార్ ఆమెతోనే జీవితం అనుకుంటాడు. అయితే మెర్సీని ఎప్పట్నుంచో ఓ సమస్య వేధిస్తుంటుంది. ఆ సమస్య గురించి కుమార్‌కి ఎప్పుడు తెలిసొచ్చింది? అది తెలిశాక కూడా ఆమెని అంతే ప్రేమించాడా? లేక ఆమెకి దూరమయ్యాడా? ఒకరి వల్ల మరొకరి జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయనేదే మిగతా కథ.



# చూడటానికి తప్ప యాక్టింగ్ తెలియదు అన్నారు

యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' చిత్రంతో వచ్చి భారీ పాపులారిటీ దక్కించుకుంది. కానీ హిట్ అందుకోలేకపోయింది. అమ్మడు అందానికి మార్కులు పడినప్పటికీ.. నటనకు మాత్రం ఒక్క హిట్ కూడా రాలేదు. భాగ్యశ్రీ బోర్సే నటించిన సినిమాలన్నీ అంతంత మాత్రంగానే మెప్పించాయి. అయినా.. ఈ భామకు.. వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రజెంట్ మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ సరసన 'కాంత' మూవీలో నటిస్తోంది. పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతుండగా.. రానా, సముద్రఖని కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి ట్రైలర్ విడుదలై ప్రేక్షకులను ఉత్రూతలూకిస్తోంది. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యశ్రీ షాకింగ్ కామెంట్స్ చేసింది. "నేను ముందుగా చెన్నైకి వెళ్లాను. నా లుక్ టెస్ట్ అక్కడే జరిగింది. అక్కడున్న రానా గారు నా లుక్ టెస్ట్ చూసి హీరోయిన్‌గా నచ్చలేదని అన్నారు. అమ్మాయి చాలా బాగుంది.. చూడటానికి తప్ప యాక్టింగ్ తెలియదు అన్నాడు. మొదట ఈ సినిమాకు నన్ను తీసుకోలేవు. కానీ సెల్వ చాలా నమ్మకంగా ఉన్నారు. నేను డైలాగ్స్, సీన్స్ చేశాక అంతా సంతోషపడ్డారు. నేను కుమారిగా నటించగలనని నమ్మారు.



# విజయ్‌ని పెళ్లి చేసుకుంటా

## ఎట్టకేలకు స్పష్టతనిచ్చిన రష్మిక

తన కోసం యుద్ధం చేసే జీవిత భాగస్వామి కావాలని నటి రష్మిక తాజాగా ఓ చిట్‌చాట్‌లో తెలిపారు. వరుస సినిమాలు, విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం వార్తలతో గతకొన్ని రోజులుగా నిత్యం రష్మిక ట్రెండింగ్‌లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్ చిట్‌చాట్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానం చెప్పారు. తన భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలని ఒక అభిమాని కోరగా రష్మిక నవ్వుతూ దానికి సమాధానమిచ్చారు. ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా ఉన్నా కూడా తన కోసం నిలబడే జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు వివరించారు. "నిజాయితీగా చెప్పాలంటే నన్ను లోతుగా అర్థం చేసుకునే వ్యక్తి. ప్రతి విషయాన్ని నావైపు నుంచి ఆలోచిస్తూ అర్థం చేసుకోవాలి. అన్ని పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి.. ఎలాంటి దాన్నైనా అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేను కోరుకుంటున్నాను. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి, నాకోసం యుద్ధం చేయగల వ్యక్తి కావాలి. అలాంటి భాగస్వామి కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాను. యుద్ధంలో తూటాకైనా ఎదురెళ్తా" అని రష్మిక తెలిపారు. ఒకవేళ మీరు డేట్ చేస్తే ఎవరితో చేస్తారు? పెళ్లి చేసుకుంటే ఎవరిని చేసుకుంటారు? అని మరో అభిమాని అడగ్గా.. "డేట్ చేస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. ఎందుకంటే నాకు నరుటో పాత్ర చాలా ఇష్టం. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా" అని చెప్పారు. ఈ సమాధానంతో ఆడియన్స్ అందరూ పెద్దగా అరుస్తూ కంగ్రాట్స్ చెప్పారు. రష్మిక థాంక్స్ చెప్పారు. అక్టోబర్ 3న రష్మిక, విజయ్‌ల నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో రష్మిక పరోక్షంగా స్పందించారు. 'నా ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు ఏం అనుకుంటున్నారో అదే నిజం. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తా' అని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టమైన సమాధానమిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది.




# రాజ్‌తరుణ్ హీరోగా చిరంజీవ

## దర్శకత్వ కోరిక తీర్చుకున్న జబర్దస్త్ అదిరే అభి

జబర్దస్త్‌తో బుల్లితెర ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వేణు, ధన్‌రాజ్‌లాంటి కమెడియన్లు.. దర్శకులుగా ఎమోషనల్ చిత్రాలు తీసి మెప్పించారు. అదే షోతో సందడి చేసిన అదిరే అభి (అభినయ కృష్ణ) డైరెక్టర్ కావాలన్న తన ఎన్నో ఏళ్ల కలను చిరంజీవ తో నెరవేర్చుకున్నారు. సోషియో ఫాంటసీ టచ్‌తో ఎంటర్‌టైనర్‌గా దాన్ని రూపొందించారు. రాజ్‌తరుణ్ హీరో, కుషిత కల్లపు హీరోయిన్‌గా తీసిని మూవీ ఓటీటీ ఆహా లో రిలీజ్ అయింది. హైదరాబాద్‌కు చెందిన శివ (రాజ్‌తరుణ్)కు దూకుడెక్కువ. ఆ వేగమే అతడిని అంబులెన్స్ డ్రైవర్‌ని చేస్తుంది. ఇతరుల ఆయుష్షు ఎప్పటి వరకూ ఉందో తెలుసుకునే పవర్ తనకు ఉందని ఓ రోడ్డు ప్రమాదంతో శివకు అర్థమవుతుంది. దాన్ని క్యాష్ చేసుకుని, తన అప్పులన్నీ తీర్చేయాలని నిర్ణయించుకుంటాడు. కార్పొరేటర్ సత్తు పహిల్వాన్‌తో ఓ డీల్ మాట్లాడతాడు. ఆ ఒప్పందమేంటి? డబ్బు కోసం అలా చేయడం తప్పని భావించిన తర్వాత శివ ఏం చేశాడు? ఓ భారీ ప్రమాదం నుంచి ఎంతోమందిని రక్షించేందుకు ప్రయత్నించిన శివకీ, స్థానిక ఎమ్మెల్యేకీ ఉన్న వైరం ఏంటి? తోటి మనిషి ఆయుష్షు ఎంతో చెప్పే వరం శివకు ఎలా వచ్చింది? తదితర అంశాల సమాహారమే చిరంజీవ. అకాల మరణం చెందిన హీరో నరకానికి వెళ్లి.. యముడిని ప్రశ్నించడాన్ని, యముడే భూమ్మీదకు రావడాన్ని కొన్ని చిత్రాల్లో చూశాం. చిరంజీవ కూడా అలా యముడి చుట్టూ అల్లుకున్న కథే. కానీ, ఇందులో ఆయన గురించి చెప్పే సన్నివేశాలే తప్ప ప్రత్యేకంగా పాత్రంటూ ఉండదు. మనిషి చావుకు నిజంగా యమధర్మారాజే కారకుడా? అని ప్రశ్నించుకునేలా చేస్తుందీ చిత్రం. హీరో పొందిన వరం గురించి సినిమా ప్రారంభంలోనే తెలుస్తుంది. దాన్ని ఎలా వాడాడన్నదే కీలకం. అంబులెన్సు డ్రైవర్‌గా కథానాయకుడి పరిచయం, వెహికల్‌ను వేగంగా నడపకపోవడాన్ని కారణంగా చెబుతూ మృతుల బంధువులు అతడితో వాగ్వాదానికి దిగడం, దాంతో అతడు మరో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయడం.. ఇలా సరదా సన్నివేశాలతో ప్రారంభమవుతుందీ సినిమా. చిన్న ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌తోనే శివ బాల్యం, కుటుంబ నేపథ్యం, అతడిది మామూలు జాతకం కాదని ప్రేక్షకుడికి అర్థమవుతుంది. అయితే కథను యమలోకానికి షిఫ్ట్ చేయకుండా జనజీవన స్రవంతి చుట్టూనే తిప్పారు. అందుకే ఇందులో విజువల్స్ కన్నా వాస్తవానికే అధిక ప్రాధాన్యముంది. తనకున్న వరమేంటో ఒకానొక సమయంలో గ్రహించిన శివ.. దాని ద్వారా డబ్బులు సంపాదించే ప్రయత్నాలు నవ్వులు పూయిస్తాయి. అయితే, లాజిక్స్ పట్టించుకోకపోతేనే అందులోని ఫన్ ఆస్వాదించగలం. అనుకోకుండా ఓ గుడికి వెళ్లిన శివలో మార్పు వచ్చినప్పటి నుంచి కథ మరో టర్న్ తీసుకుంటుంది. దాని కోసం అల్లుకున్న ఎమోషనల్ సీన్లు పెద్దగా ప్రభావం చూపవు. ఎమ్మెల్యే శివల మధ్య చిత్రీకరించిన ఘర్షణ సీక్వెన్స్‌లోనూ కామెడీని జోడించడంతో అది ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. తన బాడీ లాంగ్వేజ్‌కు తగ్గ రోల్ కావడంతో రాజ్ చెలరేగిపోయారు. హీరోయిన్ కుషిత కల్లపు అందం, అభినయంతో ఆకట్టుకుంటుంది. రచ్చ రవి తదితరులు చిన్న పాత్రల్లో సందడి చేశారు. దర్శకుడిగా అభి తొలి ప్రయత్నం మెప్పిస్తుంది.

# చక్‌దే ఎక్స్‌ప్రెస్ విడుదలలో కదలిక




మహిళల వన్డే ప్రపంచ కప్‌ను టీమ్ ఇండియా సగర్వంగా సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో అనుష్క శర్మ నటించిన చక్‌దే ఎక్స్‌ప్రెస్ మరోసారి చర్చనీయాంశమవుతోంది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా షూటింగ్ ఏడేళ్ల క్రితం పూర్తయినా ఇప్పటివరకూ విడుదలకు నోచుకోలేదు. అయితే, ఇటీవల మన అమ్మాయిలు ప్రపంచ కప్ సాధించిన నేపథ్యంలో ఈ సినిమా విడుదల చేయాలని అభిమానులు పోస్ట్‌లు పెట్టడంతో.. నిర్మాతలు దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదల కోసం నెట్‌ఫ్లిక్స్‌తో చిత్రబృందం చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. చక్‌దే ఎక్స్‌ప్రెస్ కోసం అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువవడంతో అభిప్రాయ భేదాలు వచ్చి సినిమా విడుదల ఆగిపోయిందని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వన్డే ప్రపంచకప్‌ను భారత అమ్మాయిలు గెలుచుకున్న నేపథ్యంలో దీన్ని ఇప్పుడు విడుదల చేస్తే ఆదరణ సొంతమవుతుందని చిత్రబృందం భావించినట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. భారత దిగ్గజ మహిళా క్రికెటర్ ఝులన్ గోస్వామి జీవితం ఆధారంగా.. అనుష్కశర్మ ప్రధాన పాత్రధారిగా చక్‌దే ఎక్స్‌ప్రెస్ రూపొందింది. ఈ చిత్రానికి ప్రొసిత్‌రాయ్ దర్శకత్వం వహించగా, కర్నేష్ శర్మ నిర్మాతగా వ్యవహరించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ప్రపంచకప్ గెలిచినప్పుడు ఈ సినిమాను విడుదల చేయాలని కోరుతూ అభిమానులు పోస్ట్‌లు పెట్టిన విషయం తెలిసిందే.



# రజనీకి అరుదైన గౌరవం

## అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో సన్మానం

భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఈ సన్మానం ఐఎఫ్‌ఎఫ్ఐకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. గోవా వేదికగా నవంబర్ 20 నుంచి 28 వరకు ఈ వేడుక జరుగనుంది. బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్? 1975లో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ రూపొందించిన అపూర్వ రాగంగళ్ చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, తనదైన స్టైల్‌తో, విలక్షణమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన యాక్షన్, స్టైలింగ్‌తో ఇండియా అంతటా సూపర్‌స్టార్‌గా గుర్తింపు సాధించాడు. ఇక ఈ ఎఈఈఎ వేడుకల్లో గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, పి. భానుమతి, భూపేన్ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు



# కశ్మీర్‌లో వాలిన అనుమానం పక్షి

సిద్దు జొన్నలగడ్డ నటించిన డీజే టిల్లు సినిమాతో రైటర్ కమ్ డైరెక్టర్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు విమల్ కృష్ణ. తాజాగా విమల్ కృష్ణ మరో క్రేజీ ఎంటర్‌టైనర్‌తో వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు. రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం అనుమాన పక్షి. ఈ మూవీ టీం కశ్మీర్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. జీరో అనుమానంతో కశ్మీర్ షెడ్యూల్ పూర్తయిందంటూ ట్వీట్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా షూటింగ్ లొకేషన్‌లో రాగ్‌మయూర్ అండ్ టీం దిగిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్‌తియాని, హిరాచంద్ దండ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆ ఒక్కటి అడక్కు తర్వాత చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌లో వస్తోన్న సినిమా కావడంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com